
POSTAL REGD.NO.PRAKASAM/16/2024-2026
REGD.NO. 37926/83
ESTABLISHED : 1983
అక్టోబరు 2024
వెల – ₹ 10.00

# సాయిబాబా

ఆధ్యాత్మిక వైజ్ఞానిక మాసపత్రిక

సంపుటి: 42 సంచిక: 06



# ఈ నెల పండుగలు

అక్టోబరు 01 - పూజ్య గురుపత్ని శ్రీ అలివేలు మంగమ్మ తల్లి జన్మదినోత్సవము
అక్టోబరు 12 - విజయదశమి
అక్టోబరు 12 - శ్రీ శిరిడీ సాయినాథ్ మహారాజ్ మహాసమాధి
అక్టోబరు 27 - శ్రీ నాంపల్లి బాబా ఆరాధన [తిథి - ఆశ్వయుజ బహుళ దశమి]
అక్టోబరు 29 - శ్రీ శ్రీ పాద వల్లభ స్వామి అంతర్ధానము
[తిథి - ఆశ్వయుజ బహుళ ద్వాదశి]
అక్టోబరు 30 - పూజ్య గురుదేవులు శ్రీ భరద్వాజ జన్మదినోత్సవము



“ఆకాశం నుండి పడే వర్షపునీరు నదులు, బావులలోని నీరు భగవంతుడిచ్చినదే గదా! అది దివ్యమైనదన్న గుర్తు మనకు లేకపోవడంవల్లనే అది సామాన్యమైన నీరులా ప్రవర్తిస్తుంది. అది దివ్యమైనదని గుర్తుంచుకొనడమే సాధనంతా. అపుడు మన అజ్ఞానమనే పొర మన కండ్లపై నుండి తొలగి మనకు వాటి దివ్యత్వమనుభవమవుతుంది. ఇదే నిజమైన ఆధ్యాత్మికత."

**పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ**

# నా సమాధి నుంచి నా కర్తవ్యాన్ని నిర్వహిస్తాను

*పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ*

శ్రీ సాయిబాబా గురుసేవా వృత్తాంతం గురించి చదివాక మనకు కొన్ని ప్రశ్నలు ఉదయిస్తాయి.

**1. శ్రీ సాయికి గురువు ప్రత్యక్షంగా ఎదుటనున్నారు గనుక వారు అలా సేవించుకోగలిగారు. మనకీనాడు సాయి అలా అందుబాటులో లేరు కదా!**

**2. సాయికి లౌకికమైన ఎట్టి బాధ్యతలు లేవు, కాబట్టి గురువు లభించినా, అలా నిరంతరం సేవించుకోగలిగారు. జీవితంలో బరువు బాధ్యతలు గల మనం అంతగా ఆయనను సేవించడం ఎలా సాధ్యం?**

కానీ ముఖ్యమైన ప్రశ్నలివి కావు. అంతటి గురువు ఈనాడు మనకు లభించినా మనలో అంతలాగా సేవించే దీక్ష, విశ్వాసాలు వుండవద్దా? సాయి భౌతికంగా శిరిడీలో జీవించిన 56 సంవత్సరాలలో ఆయనను ఎందరు అలాగ సేవించగలిగారు? అట్టివారు తమకు ఒక్కరు కూడా కనిపించలేదని సాయియే అన్నారు. వారి ప్రత్యక్ష భక్తులలో కెల్లా గొప్పవారుగా పేరుపొందిన శ్రీ ఉపాసనీ బాబా కూడా సాయి దృష్టిలో శిష్యుడు అనదగినవారు కాదు. సాయి పెట్టిన నాలుగు సంవత్సరాల గడువు పూర్తిగా ఖండోబా ఆలయంలో వుండజాలక మూడున్నర సంవత్సరాలకి శిరిడీ విడిచి వెళ్ళిపోయారు.

అందుకనే ఈనాడు బాబా తమ భౌతికరూపాన్ని సమాధిలో నిక్షిప్తం చేసి, నిత్య జాగరూకులై, చైతన్యంగా నిలచారు. భక్తితో పిలిచిన పలుకుతామని, తమ మట్టి సమాధానము చెబుతుందని, తమ సమాధి ఎప్పుడూ భక్తుల వెంటనుండి కాపాడుతుందని, తమ సమాధినుండి కూడా తాము యథాపూర్వం తమ భక్తులను కనిపెట్టి వుంటామని వారు ప్రతిజ్ఞ చేశారు. ఇది ఎందరో భక్తుల అనుభవం కూడా.

వారు అంత శక్తిమంతులు కదా, తమ భౌతిక దేహంతోనే చిరకాలం



నిలిచియుండక, మహాసమాధి ఎందుకు చెందారు? – అని అడగవచ్చు. సాయి వంటి ఉత్తమాధికారులు తప్ప సమకాలీనుడైన మహాత్ముని అంత నిశ్చలమైన భక్తి శ్రద్ధలతో సామాన్యులు సేవించుకోలేరు. ఎంతటి మహాత్ముడైనా మనమధ్య భౌతికదేహంతో సంచరిస్తుంటే, క్రమంగా మనలో అశ్రద్ధ పెరిగి, వారిలోనూ మానవత్వాన్నే చూస్తాము. బాల్యము నుండి శ్రీకృష్ణుడు ఎన్ని లీలలు చూపినా, చనువుతో కూడిన మిత్రభావం వలన అర్జునుడు కేవలము

ఆధ్యాత్మిక వైజ్ఞానిక మాసపత్రిక

# సాయిబాబా

OFFICIAL ORGAN OF SRI MANGA BHARADWAJA TRUST

సంపుటి:42 అక్టోబరు - 2024 సంచిక:06

**పరమపూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారిచే స్థాపించబడిన ఏకైక పత్రిక, మన "సాయిబాబా"**

## విషయ సూచిక


| | | | |
|---|---|---|---|
| 01. | నా సమాధి నుంచి నా కర్తవ్యాన్ని నిర్వహిస్తాను | పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ | 03 |
| 02. | "శ్రీ సాయి మాస్టర్ ఎవరు?" | పూజ్య గురుపత్ని శ్రీ అలివేలు మంగమ్మ | 06 |
| 03. | మనందరికీ అమ్మ మాతృశ్రీ అలివేలు మంగమ్మ | శ్రీమతి శ్రీదేవి | 15 |
| 04. | మన ఇల్లు | శ్రీమతి అడిదం వేదవతి | 19 |
| 05. | మాతృదేవి స్మృతులు | శ్రీమతి సాయిరామలక్ష్మి; శ్రీమతి లక్ష్మీ శ్రీదేవి | 24 |
| 06. | "బాబా నా పసుపు కుంకుమలు నిలిపారు" | శ్రీమతి బి.వి.మణి | 26 |
| 07. | ఆచార్యుని అద్భుత లీలలు | శ్రీమతి లలిత | 27 |


*1వ తేదీ పూజ్య గురుపత్ని శ్రీ అలివేలుమంగమ్మ తల్లి జన్మదినోత్సవము, 24వ తేదీ శ్రీ శిరిడీ సాయిబాబా మహాసమాధి చెందిన విజయదశమి పర్వదినము, చివరలో 30వ తేదీన పూజ్య భరద్వాజ గురుదేవుల జన్మదినోత్సవములు కలిగియున్న పుణ్యప్రదమైన అక్టోబర్ నెల సాయిబాబా మాసపత్రికను భక్తులందరికీ గురుస్మరణ జరిగే విధంగా ప్రత్యేక సంచికగా విడుదల చేస్తున్నాము. ఈ కారణంగా స్థలాభావం వల్ల ప్రతినెలా వచ్చే ధారావాహికలు ఈనెల నిలిపివేయబడ్డాయి. వచ్చే నెల నుండి యథాప్రకారం కొనసాగించబడతాయి.*

*– ఎడిటర్*

**చిరునామా**

Sri Manga Bharadwaja Trust,
Bhakta Nivas, 12-1-170/46P, Hanuman Nagar,
Jaipuri Colony, Nagole, Hyderabad - 500068
Phone No. +91 - 74160 41550

**www.saibharadwaja.org**

**చీఫ్ ఎడిటర్: డా॥ ఆర్.ఎస్. శశిధర్, పిహెచ్. డి**

**చందా వివరములు**

విడి ప్రతి : ₹ 10-00
సంవత్సర చందా : ₹100-00

సాయిబాబా పత్రికలో వెలువడే వ్యాసాలకు, అభిప్రాయాలకు ఆయా రచయితలే బాధ్యులు.

సామాన్య స్నేహితుడిగా, ఒక యాదవుడిగా మాత్రమే ఆయనను తలచాడు. యుద్ధభూమిలో విశ్వరూప సందర్శనం అయినప్పుడు మాత్రమే అతడు తన పొరపాటును గుర్తించగలిగాడు. అలానే నిరంతరము సాయిలీలలను చూస్తూ కూడా, వారి పాదాలలో నుండి అనుగ్రహించబడిన గంగా, యమునా జలాలను తీర్థముగా త్రాగలేక పోయాడు దాసగణు. సర్వ తీర్థాలు, సకల దేవతలు వున్నాయని ఒక్క క్షణంలో ప్రత్యక్షంగా చూసిన అతడు యితర పుణ్యక్షేత్రాలను దర్శించాలని ఆరాటపడుతూ వుండేవాడు. నార్కే అనే భక్తునికి సాయి పిచ్చివారేమోనని సందేహం కూడా కలుగుతుండేది. బాలక్ రాం మాన్కర్ వంటి భక్తవరుడికి కూడా సాయిని ఎప్పుడూ చూస్తూండటం వల్ల వారు దేహబద్ధులైన సామాన్య సాధకులేమోనన్న భావం అతనిని వదలలేదు. అతడిని మచ్ఛీంద్రగడ్ పంపి అక్కడ కూడా మరొక భౌతికదేహంతో దర్శన, స్పర్శన, సంభాషణలను అనుగ్రహించి అతడి భ్రాంతిని దూరం చేశారు. కొంతవరకైనా శ్రద్ధాభక్తులతో సేవించుకోగలిగిన వారిని ప్రత్యక్షంగానే సేవించుకోనిచ్చారు.

ఈ వివరణకు పర్యవసానం? మనపై కరుణభావంతోనే సాయి మహాసమాధి చెంద నిశ్చయించుకున్నారు. భౌతికమైన ఎడబాటు పరోక్షత వారిపై మనకి గల ప్రేమను భక్తిని యినుమడింపజేస్తుంది. అట్టి భక్త్యంకురాన్ని వారి చరిత్ర, చరిత్ర పఠన, యిప్పటికీ ప్రకటమవుతున్న లీలా విభూతిని మన హృదయాలలో నాటుతాయి. వాటిని పటిష్టం చేయటానికి అవసరమైనప్పుడు భక్తులు కోరకున్నా, సాయి వారికి తమ భౌతిక రూపంతో దర్శనము యిస్తూనే వున్నారు. ఇక మిగిలింది వారు సూచించిన విధానాన్ని అర్థం చేసుకొని వారిపై అచంచలమైన విశ్వాసంతో దానిని అనుసరించడమే! అది ఎలా చేయాలన్నదే మన ప్రస్తుతాంశము.

నిరంతరమూ సాయి భౌతిక రూపము వారి మధ్య వుండటం వలన ప్రత్యక్ష భక్తుల దృష్టి బాబా యొక్క విశ్వవ్యాప్తమైన, అనంత లీలావిభూతివంతమైన వారి దివ్య తత్వం మీదనుండి తొలగి, వారి పరిమిత మానవాకృతి మీద, వారి సామాన్య జీవక్రియల మీద కేంద్రీకృతమై, వారు కూడా మన వంటి మానవులు అన్న ఏమరపాటు కలిగేది. ఆ విషయంలో యిప్పటి మనం ఎంతో అదృష్టవంతులం. వారి లీలలలో ప్రకటమయ్యే సద్గురుతత్వమే వారి దివ్యచరిత్ర గ్రంథాల రూపంలో మన మనోనేత్రం ముందు ప్రత్యక్షమవుతుంది. వారి చిత్రపటం మనం ప్రత్యక్షంగా చూచి సేవించ నోచుకోని వారి భౌతిక రూపానికి ప్రతిబింబము అవ్వడం వలన మనలో అలాంటి ఏమరపాటును కలిగించదు. కనుక లభ్యమైనంతవరకు సమగ్రమైన వారి దివ్య చరిత్ర గ్రంథాలను పారాయణ చేయటం వలన వారి పట్ల మనకు భక్తి వెల్లువలై పారుతుంది. మొదట లభ్యమైన సాయి చరిత్ర గ్రంథాలన్నింటినీ చదివి, వాటిలో మన హృదయాన్ని ఏది ఎక్కువగా ఆకర్షిస్తుందో, దానిని నిత్య పారాయణ గ్రంథంగా వుపయోగించుకోవాలి. ఎప్పుడైనా అవసరమైనప్పుడు కొత్తదనం కోసం ఇతర చరిత్ర గ్రంథాలను, యిప్పటికీ ప్రకటమవుతున్న వారి లీలలను తెలియజేసే పత్రికలను చదువుతూ వుండాలి. ఈ విధంగా సాయి యొక్క విశ్వరూపము మన హృదయంలో కొంత స్థిరపడ్డాక దానిని గురించి చింతన చేస్తూ, సాయి వారి గురువును సేవించినట్లు మనము వారి చిత్రపటానికి పూజాది సేవలు చేయడం ఆరంభించాలి. సాయి పటానికి, సాయికి భేదము లేదని తెలిపే లీలలను స్మరించి వారు ప్రత్యక్షంగా పటములో వున్నారని గుర్తించి పూజించాలి.

కొన్ని ఆవృత్తాలు చరిత్ర పారాయణ చాలినంత జరిగాక, అప్పుడు వారి సూక్తులను బోధలను వివరించి చెప్పే 'శ్రీ సాయి ప్రబోధామృతం' వంటి గ్రంథాలను విరామ సమయాల్లో చదివి మననం చేసుకోవాలి. అప్పుడు ఆయన బోధించిన సాధనా విధానము యొక్క స్వరూపము కొంతైనా అర్థమవుతుంది. అందువలన మన సాధనకు ఆటంకమును కల్పించే మన దృక్పథం మార్పుచెంది సాధన సుగమం అవుతుంది. ఆ సాధనను క్రమంగా మన నిత్యజీవితంలోని ప్రతి చిన్నపని లోనికి ఎలా వ్యాపింప చేసుకోవాలో మనకే తెలుస్తుంది

సాయి సాధనంతటికీ మూలమును మూడు అంశాలుగా చెప్పవచ్చు.

**1. విశ్వములోని అన్ని రూపాలలోనూ వ్యాపించి ఒకే సాయి తత్వం నిండియున్నది' అన్న గుర్తింపు--మన ఆలోచనలు, పనులు అన్నింటికీ నేపథ్యంలో ఎప్పుడు వుండేలాగా చేసుకోవటం.**

**2. ఇట్టి అవగాహన సహాయముతో మనకు సాటివారి పట్ల గల రాగ, ద్వేష, అసూయాది భావాలను తొలగించుకోవడం.**

**3. జీవిత కర్తవ్య రూపమైన మన లౌకిక కార్యాలు అన్నీ మనలోని కర్మ వాసనలను క్షయింప జేసుకోవడానికేనని గుర్తించి ఆయా కార్యాలను క్షుణ్ణంగా చేయడము. మనకు ఐహికముగాను, ఆధ్యాత్మికంగాను సాయిబాబాయే బాధ్యులని గుర్తుంచుకోవడం.**

ఈ మూడు అంశాలే శ్రద్ధ, ఓరిమి.

# "శ్రీ సాయి మాస్టర్ ఎవరు?"

*పూజ్య గురుపత్ని శ్రీ అలివేలు మంగమ్మ*

ఆ పేరే చెప్తుంది – ఆయన ఎవరోనన్నది!

సమాధిచెంది వంద సంవత్సరాలు అవుతున్నప్పటికీ తమ అపార మహిమతో ప్రపంచాన్నే ప్రభావితం చేస్తున్న సమర్థ సద్గురు శ్రీ శిరిడీ సాయినాథుని సంపూర్ణ అనుగ్రహాన్ని పొందిన మాస్టర్ ఆయన!

శ్రీ సాయినాథుని గురించి సంపూర్ణంగా తెలుసుకున్న, వివరించగలిగిన మాస్టర్ ఆయన!

చివరకు సాయియే తాముగా మారిన మాస్టర్ ఆయన!!

అందుకే ఆయన శ్రీ సాయి మాస్టర్!!

ఆయనే పూజ్యశ్రీ ఆచార్య ఎక్కిరాల భరద్వాజ గారు!!!


అంతేకాదు, క్లుప్తంగా చెప్పాలంటే – 'ఆధ్యాత్మికత' అంటే ఏమిటి? అనే దానికి అర్థమే ఆయన. 'ఎందుకు' అనేదానికి నిర్వచనమే ఆయన.

సరియైన జీవిత విధానమే ఆధ్యాత్మికత. లౌకిక జీవితము, పారమార్థిక జీవితము వేరు వేరు అని భావిస్తారు గాని అది సరియైనది కాదు.

ఆధ్యాత్మిక జీవితం కావాలనుకుంటే అన్నింటిని త్యజించాలని అనుకుంటారు చాలామంది. లోకంలో చాలా మంది ఆధ్యాత్మికవేత్తలు అనబడేవారు లౌకికత పట్టనట్టు వుండడమే అందుకు కారణం.

కానీ పూజ్యశ్రీ మాస్టరుగారు ఆధ్యాత్మికత కావాలనుకుంటే ప్రాపంచిక జీవితాన్ని త్యజించనవసరం లేదని, ప్రాపంచిక జీవితాన్నే 'పారమార్థిక జీవితంగా' మలచుకోవచ్చుని చెప్పడమేగాక ఆచరణ ద్వారా నిరూపించారుగూడా.

పూజ్యశ్రీ మాస్టరుగారి గురించి తెలిసినవారు ఎంతోమంది వున్నారు. తెలియనివారుగూడ కొంతమంది వుండి వుండవచ్చు. తెలియని వారు తెలుసుకొనడానికి, తెలిసినవారు మరికొంత తెలుసుకోడానికి ఆయన గూర్చి



క్లుప్తంగా ఇప్పుడు చెప్పుకుందాము.

పూజ్యశ్రీ మాస్టర్‌గారు విద్యార్థిదశలోనే తమకు అత్యంత ప్రీతిపాత్రుడైన తమ అన్నగారి కుమారుని మరణంతో ఆవేదన చెంది జననమరణాల తత్త్వాల గురించి అన్వేషణ ప్రారంభించారు. అట్టి తీవ్ర అన్వేషణతో ప్రారంభమైన సాధన సుమారు ఆరు ఏడు సంవత్సరాలపాటు కొనసాగి ఒక ఉన్నత స్థాయికి చేరుకున్నది. అప్పుడు తమకు ఒకానొక ప్రశాంతత నెలకొన్నదని ఆయనే చెప్పారు. ఆ తర్వాత శిరిడీ సాయినాథుని దర్శనంతో, ఆ సద్గురుని అనుగ్రహంతో విశ్వచైతన్యానుభూతిని

అనుభవించారు. అంటే విశ్వచైతన్య స్వరూపుడైన శ్రీసాయినాథునితో ఆయన తాదాత్మ్యం చెందారు. అంటే ఆయనకు ఆత్మానుభూతి కలిగిందన్నమాట!

శ్రీ శిరిడీ సాయినాథుడు నలుగురు మిత్రులతో కలసి అన్వేషిస్తూ వెళ్ళడము, చివరకు గురువు తటస్థించి ఆయనను పరిపూర్ణులుగా చేయడంతో ఈ సంఘటనను పోల్చవచ్చు.

ఒకపక్క ఇట్టి తీవ్రసాధన కొనసాగిస్తూనే తాము ఎవరిపైన ఆధారపడకూడదని, అప్పుడైతేనే తమ ఇష్టప్రకారం తమ జీవితం నడుపుకోవచ్చుని నిర్ణయించుకొని లౌకిక విద్యను పూర్తి చేసి అధ్యాపక వృత్తిని చేపట్టారు.

విద్యార్థులకు లౌకికవిద్యతోపాటు ఆయన ఆధ్యాత్మికతను కూడ బోధించేవారు. పాఠ్యాంశాలనుంచే ఆధ్యాత్మికతను వెలికితీసి ఒక్కొక్కచోట జొప్పించి, మరొకచోట మేళవించి మరీ చెప్పేవారు. అంతేగాక మానవజీవిత తత్త్వాన్ని, జీవితసారాన్ని, లౌకిక పారమార్థికతల సమన్వయాన్నీ గూడ రంగరించిపోసారు.

ఆయన బోధనా దక్షత గురించి ఆయనవద్ద చదువుకున్న విద్యార్థులు ఇలా చెప్తారు : "పూజ్యశ్రీ భరద్వాజ మాస్టరుగారు మాకు ఇంగ్లీషు పద్య భాగానికి (Poetry) వచ్చేవారు. ఆయన 'ది బెస్ట్ టీచర్ (The Best Teacher). చాలా అద్భుతంగా పాఠం చెప్పేవారు. మాకు 'టు ఎ స్కైలార్క్ (To a Skylark)' అనే పోయం (Poem) వుండేది. అది రహస్యవాదానికి సంబంధించినది. ఆకారంలో కనబడనంత ఎత్తులో ఎగిరే పక్షి గురించినది. అందులో ఆత్మకు సంబంధించిన అంతరార్థం మాస్టరుగారు అద్భుతంగా చెప్పేవారు. అటువంటి వివరణను ఆయన తప్ప మరెవ్వరూ చెప్పగలరని అనిపించదు. ఆయన విశ్లేషణ ఒక అధ్యాపకుడు పాఠం చెపుతున్నట్లు గాక అనుభవసారాన్ని బోధిస్తున్నట్లు వుండేది. అలానే 'ది కాన్సెప్ట్ ఆఫ్ గాడ్ (The Concept of God) అనే వ్యాసాన్ని గూడా ఆయనే చెప్పారు. ఫిలాసఫీ (Philosophy)లో అన్ని మతాల గూర్చిన అవగాహన పూర్తిగా వున్నవారు మాత్రమే అంత అద్భుతంగా చెప్పగలరు. అందుకే ఆయన అత్యుత్తమ ఉపాధ్యాయులు"

పూజ్యశ్రీ మాస్టరుగారు 1983వ సం॥లో శ్రీ శిరిడీ సాయినాథుని అనుగ్రహాన్ని అనుభవించడంతో ఆయననే తమ గురువుగా భావించి ఆయన స్మరణ, సేవలకే తమ జీవితాన్ని అంకితం చేసారు.

శ్రీ సాయిసేవలో భాగంగా అనేక సత్సంగాలు, ప్రవచనాలు చేసారు. శ్రీసాయి గూర్చిన గ్రంథాలేగాక ఆధ్యాత్మిక పరమైన ఎన్నో గ్రంథాలు రచించారు.

గురువు తన శిష్యుని తనంతటి వాడిగా తయారు చేస్తారు. శ్రీ సాయినాథుడు పూజ్యశ్రీ మాస్టర్ గారిని తమ ప్రతిరూపంగా మలచారు. నిరంతర సాయి స్మరణలో లీనమైన ఆయన శ్రీసాయియే తాముగా పరివర్తన



చెందారు! అందుకే శ్రీ సాయినాథుని వద్ద జరిగిన అద్భుతలీలలెన్నో పూజ్యశ్రీ మాస్టరుగారి వద్దకూడ జరిగాయి, జరుగుతున్నాయి గూడా. పూజ్యశ్రీ మాస్టరుగారి పుట్టినరోజు సందర్భంగా మరొక్కసారి ఆయన చేసిన లీలలను కొన్నింటిని స్మరించుకుందాము.

పూజ్యశ్రీ మాస్టరుగారు ప్రమాద పరిస్థితులలో వున్న రోగులను కేవలం ఊదీతోనే రక్షించిన సందర్భాలు ఎన్నో వున్నాయి. ఉదాహరణకు శ్రీ అళహరి సుధాకరరావుగారు తమ అనుభవాన్ని యిలా చెప్పారు.

"1987లో నా భార్యకు అబార్షన్‌యై సెరిబ్రెల్ హెమరేజ్ వచ్చి ఫిట్స్ రావటంతో ఒంగోలులోని బి.వి.ఎల్. హాస్పటల్ లో

చేర్పించారు. మరొక ఊరులో వున్న నేను, హోమియో డాక్టరైన మా మేనకోడలు అరుణతో కలసి ఒంగోలు చేరుకున్నాము. నా శ్రీమతికి చికిత్స చేస్తున్న డాక్టర్‌గారు ఆమె జీవించే అవకాశం ఏమాత్రం లేదని చెప్పారు. ఐతే మద్రాసు తీసుకువెళ్ళమంటారా అని మా మేనకోడలు అడిగితే, "ఒక డాక్టరై వుండి నీకు తెలీదా? మద్రాసే కాదు, అమెరికా తీసుకువెళ్ళినా ఇంతకంటే చేసేది ఏమీ లేదు. కదిలిస్తే ఇంకా సీరియస్ అవుతుంది" అన్నారు. ఇంక చేసేది లేక హోమియోలో ప్రయతిద్దామని మాస్టర్ ఎక్కిరాల కృష్ణమాచార్య గారి అబ్బాయి (హోమియో డాక్టరు) ఫోన్ కోసం ప్రయత్నిస్తే నెంబరు దొరకలేదు. అప్పుడు మా మేనకోడలు చెప్పింది, 'ఈ ఊళ్ళో కృష్ణమాచార్యగారి తమ్ముడు, సాయి భక్తులు శ్రీ భరద్వాజగారు వున్నారు. ఆయన దగ్గరకి వెళితే ఫోన్ నెంబరు దొరకవచ్చు" అని. వెంటనే సాయిబాబా గుడికి వెళ్ళి వారి ఇంటి అడ్రస్ అడిగాము. అక్కడ వున్న ఒక అమ్మాయి తనకు తెలుసునని చెప్పి భరద్వాజగారి ఇంటి వద్ద మమ్మల్ని దింపి వెళ్ళింది.

శ్రీ భరద్వాజ గారు మమ్మల్ని చూచి కూర్చోమని చెప్పి, "ఏమ్మా, ఏంటి సంగతి?" అని అన్నారు. నా మేనకోడలు నా భార్యకు బాగాలేదని చెప్పింది. అప్పుడు ఆయన నాతో ఏం బాగాలేదో చెప్పమన్నారు. నా భార్యకు అబార్షన్‌యై సెరిబ్రెల్ హేమరేజ్ వచ్చిందని, డాక్టర్లు ఆశ లేదన్నారని చెప్పాను. అప్పుడు ఆయన ఆ మాట మూడుసార్లు నాచేత చెప్పించారు. అలానే ఆయన మూడుసార్లు ఊదీ తీసుకుని, "నీ భార్య తింటున్నట్టు భావించి తిను" అన్నారు. తర్వాత ఆయన కొంత ఊదీ నా చేతికిచ్చి, "ఆస్పత్రికి వెళ్ళి నీ భార్య తలకు వ్రాయి. ఏమీ ఫర్వాలేదు. బాగైన తర్వాత బాబాకు పల్లకీ సేవ చేయించు" అన్నారు. ఆయన మాటతో నాకు ధైర్యం వచ్చింది. వెంటనే వెళ్ళి ఆ ఊదీని నా భార్య తలకు వ్రాసాను. సరిగ్గా ఊదీ వ్రాసిన 15 నిమిషాల తర్వాత డాక్టర్ గారు వచ్చి నా భార్యను చూచి, "ఇక ఫర్వాలేదు" అన్నారు. నా భార్య ఆరోగ్యవంతురాలైనది. ఇది కేవలం శ్రీ భరద్వాజగారి అనుగ్రహమే. భరద్వాజగారిపట్ల కృతజ్ఞతా భావంతో నేను మా అబ్బాయికి 'భరద్వాజ' అని పేరు పెట్టుకున్నాను".

ఇలా ప్రాణాపాయ పరిస్థితిలో వున్నవారినెందరినో ఆయన రక్షించారు. అందుకే ఆయన ప్రాణప్రదాత.


జి.సి. సుబ్బారెడ్డిగారి అన్న కుమార్తె 18 సం॥ల వెంకట లక్ష్మికి బ్రెయిన్ వ్యాధి వచ్చింది. మద్రాసులో ఆస్పత్రిలో చేర్పించారు. 3నెలలు గడిచాయి. కాని ఫలితం లేకపోగా ఆ అమ్మాయికి చూపు, మాట పూర్తిగా పోయి కోమాలోకి వెళ్ళిపోయింది. డాక్టర్లు లాభం లేదని చెప్పడంతో తిరిగి ప్రొద్దుటూరు తీసుకువచ్చి త్యాగరాజ రెడ్డి హాస్పటల్ లో చేర్పించారు. కాని పరిస్థితిలో ఏ మార్పు రాలేదు. సరిగ్గా అదే సమయంలో పూజ్యశ్రీ మాస్టర్ గారు ప్రొద్దుటూరు వచ్చారని తెలిసి సుబ్బారెడ్డిగారు మాస్టర్ గారిని దర్శించి పాప పరిస్థితి తెలియజేసారు. పూజ్యశ్రీ మాస్టరుగారు వెంటనే ఆస్పత్రికి వెళ్ళి ఒక టెంకాయ తెప్పించి ఆ అమ్మాయి చుట్టూ మూడుసార్లు తిప్పి కొట్టారు. ఆ అమ్మాయి కళ్ళను తమ అమృత హస్తంతో స్పృశించి, "ఏమీ ఫర్వాలేదు. చూపు, మాట గూడా వస్తాయి" అని చెప్పి వెళ్ళారు. ఆ మరుసటిరోజునుంచే ఆమె కోలుకున్నది. మాట, చూపుకూడా వచ్చాయి.

శ్రీమతి కె.రామలక్ష్మి భర్త ఆరోగ్యపరిస్థితి బాగాలేదు. ఆర్థిక సమస్యలు గూడ ఎదురయ్యాయి. ఆ సమయంలో ఒకసారి వారి ఇంటి వెనుక వున్న సాయిబాబా భక్తుల ఇంట్లో



భజన జరుగుతుంటే వెళ్ళింది. ఆ ఇంటి ఆవిడ ఈమె సమస్యలు విని పూజ్యశ్రీ మాస్టరుగారు రచించిన 'శ్రీసాయిలీలామృతం' పుస్తకం యిచ్చి దానిని పారాయణ చేయమని, కష్టాలు తొలగుతాయని చెప్పింది. ఆ పుస్తకం తెచ్చుకున్నప్పటికీ రామలక్ష్మి చదవకుండానే ఒక వారం రోజులు ఆ పుస్తకాన్ని ఇంట్లో వుంచుకుని సప్తాహ పారాయణ చేసానని చెప్పి ఆమెకే తిరిగి యిచ్చేసింది. ఆ తరువాత ఆమెకు విపరీతమైన తలనొప్పి ప్రారంభమై ఎంతకూ తగ్గడం లేదు. ఒకరోజు స్వప్నంలో ఆమె ఒక గుడి ముందు కూర్చున్నది.

పూజ్యశ్రీ మాస్టరుగారు అందరికీ భిక్ష వేస్తూ ఈమె దగ్గరకు వచ్చి ఆగిపోయారు. ఈమె చేయి చాపి ఆయనను భిక్ష అడుగుతున్నది. అప్పుడు ఆయన, "గురువులకే గురువు, వైద్యులకే వైద్యుడు, జ్ఞానులకే జ్ఞాని అయిన బాబా చరిత్ర చదివానని అబద్ధం చెప్పావు. అందుకే నీకీ తలనొప్పి. బాబా చరిత్ర చదువుతానని చెప్పు. వైద్యం నేను చేస్తాను" అన్నారు. అప్పుడు ఆమె దుఃఖిస్తూ ఆయన పాదాలు పట్టుకున్నది. ఆయన తమ కుడిచేతిని ఆమె తలపై వుంచి ఆశీర్వదించారు. అంతటితో ఆమెకు స్వప్నం అంతరించింది.



అంతే! ఆ రోజు నుంచి ఆమె తలనొప్పి తగ్గిపోయింది. ఆ తర్వాత ఆమెకు ఎలాంటి ఆరోగ్యసమస్యలూ లేవు.

అంతేగాక ఆయన మాటమాత్రంతోనే వ్యాధులు తగ్గించేవారు. "ఏం ఫర్వాలేదు" అన్నారంటే ఎంతటి వ్యాధి అయినా తగ్గవలసిందే! కొందరికి 'శ్రీ సాయిలీలామృతము', 'శ్రీగురుచరిత్ర' పారాయణలు చెప్పేవారు. కొందరికి 'గాణగాపురం', 'నర్సోబావాడి' మొ॥న క్షేత్ర దర్శనం చేసుకోమని చెప్పేవారు.

ఆయన విధిని మార్చిన సందర్భాలెన్నో! ఒంగోలుకు చెందిన పర్వతరావుకు పుత్రసంతానం లేదని జ్యోతిష్కులందరూ చెప్పారు. అప్పుడు మాస్టరుగారు అతనికి కొన్ని పారాయణలు చెప్పి ఎలా చేసుకోవాలో చెప్పారు. అతడలా చేయడంతో అతనికి పుత్ర సంతానం కలిగింది.

ఆయన కొందరి వ్యాధులను తాము స్వయంగా అనుభవించేవారు. అంటే వారి పూర్వకర్మలను తాము అనుభవించే వారన్నమాట. ఒక్కొక్కరు తీవ్ర జ్వరంతో బాధపడేవారు వస్తే, వారు నమస్కరించగానే వారి జ్వరం తగ్గిపోయేది. కాని పూజ్యశ్రీ మాస్టరుగారికి వెంటనే జ్వరం వచ్చేది. ఒకసారి ఒక వ్యక్తి తీవ్రమైన కడుపునొప్పితో బాధపడుతూ వచ్చాడు. పూజ్యశ్రీ మాస్టరుగారు ఊదీ యివ్వగానే అతని కడుపునొప్పి తగ్గిపోయింది. గాని పూజ్యశ్రీ మాస్టరుగారు కొన్నిరోజులు కడుపునొప్పితో బాధపడ్డారు.

పూజ్యశ్రీ మాస్టరుగారు తమ వద్దకు వచ్చేవారి సమస్యలనెన్నింటినో తీర్చేవారు. చింతా లక్ష్మీనారాయణగారికి 1978 సం॥లో విద్యానగర్‌లో పూజ్యశ్రీ మాస్టర్ గారితో పరిచయ భాగ్యం కలిగింది. తర్వాత ఒకసారి శ్రీ మాస్టరుగారు ఆయన పనిచేసే బ్యాంకు వచ్చారు. అప్పుడాయన తన ప్రమోషనులో ఎంతో జాప్యం జరుగుతోందని మాస్టరుగారితో చెప్పారు. అందుకు పూజ్యశ్రీ మాస్టర్‌గారు, "శ్రీ సాయిలీలామృతం 9 సార్లు పారాయణ చేయి. ఫలితం నువ్వే చూస్తావు" అన్నారు. లక్ష్మీనారాయణగారు అలానే చేసారు కాని సరిగ్గా ఆ సమయంలోనే ఆ ప్రమోషన్స్ విషయం కోర్టుకి ఎక్కటంతో 2,3 సం॥ల తర్వాత గాని ప్రమోషన్స్ వచ్చే అవకాశమే లేదనే వార్త తెలిసింది. అప్పుడాయన పూజ్యశ్రీ మాస్టరుగారి దగ్గరకి వెళ్ళి, "మాస్టరుగారు! పారాయణ చేసాను. ఫలితమే కనిపించలేదు. ఇలా జరిగింది. బాబా మీ మాట వినలేదు" అని చెప్పారు. పూజ్యశ్రీ మాస్టరుగారు ఏమీ మాట్లాడకుండా చిరునవ్వు నవ్వి ఊరుకున్నారు. సరిగ్గా నెలరోజులు తిరగకుండానే కోర్టులో విషయం తేలిపోవటంతో లక్ష్మీనారాయణగారికి బ్యాంక్ ఆఫీసర్ గా ప్రమోషన్ వచ్చింది. పూజ్యశ్రీ మాస్టరుగారితో ఆ విషయం చెబితే ఆయన చిరునవ్వుతో, "మంచిది, శుభం" అన్నారు.

పూజ్యశ్రీ మాస్టర్‌గారు సర్వజ్ఞులు. ఇందుకొక ఉదాహరణ:

కొత్తపాలెంకు చెందిన పి.విజయకుమార్ తిరుపతిలో పి.జి. చదువుతున్నాడు. ఆ సంవత్సరం వినాయకచవితి రెండు రోజులు వుందనగా వాళ్ళ అమ్మగారు పూజ్యశ్రీ మాస్టర్‌గారి వద్దకు దర్శనానికై వచ్చి, "ఈసారి వినాయక చవితికి విజయకుమార్ రావట్లేదు సార్" అని చెప్పింది. శ్రీ మాస్టర్ గారు, "వాడు వస్తాడమ్మా. వినాయక చవితి నాడు తెల్లవారుఝామున 4 గంటలకు వస్తాడు" అని చెప్పారు. "రావడానికి అవకాశమే లేని అతను ఎలా వస్తాడు. అయ్యవారు ఇలా చెప్పారేమిటి" అని అనుకున్నారు ఆవిడ. కాని అతడు అనుకోకుండా బయల్దేరి వినాయకచవితికి ముందురోజు రాత్రి విద్యానగర్ వచ్చాడు. అకస్మాత్తుగా పెద్ద వర్షం రావడంవల్ల కొత్తపాళెం వెళ్ళలేక వర్షం తగ్గినతర్వాత వెళ్ళాడు. సరిగ్గా తెల్లవారుఝామున 4 గంటలకు ఇల్లుచేరి తలుపు తట్టాడు. తలుపు తీసిన వాళ్ళ అమ్మ ఆశ్చర్యానికి అంతులేదు. పూజ్యశ్రీ మాస్టర్ గారు చెప్పినది అక్షరాలా జరిగినందుకు అందరూ ఎంతో ఆనందించారు.

అమెరికాలో వుండే ఒక భక్తురాలు తమ అనుభవాన్ని యిలా చెపుతున్నారు.

"పూజ్యశ్రీ మాస్టర్‌గారి గురించి ఫేస్బుక్(Facebook) లో చూసి ఆయన పుస్తకాలు పారాయణ చేస్తున్నాను. ఒక సంవత్సరం క్రితం నేను భారతదేశం వచ్చాను. శ్రీశైలం వెళదామని మా ప్లాన్. గురుబంధువైన జగదీశ్ గారు శ్రీశైలం వెళితే శ్రీపూర్ణానందస్వామి సమాధి దర్శనం చేసుకోమని చెప్పారు. మావారు శ్రీశైలం తిరుగు ప్రయాణంలో స్వామి సమాధి దర్శనం చేసుకుందామన్నారు. శ్రీశైలంలో శ్రీమల్లిఖార్జునస్వామి దర్శనము, అభిషేకాలు ముగించుకుని వచ్చేసరికి బాగా అలసిపోయి పడుకున్నాము. చాలా ఆలస్యంగా నిద్రలేవటంవల్ల సాయంత్రం ఆరు గంటలకు తిరుగు ప్రయాణం అయినాము. మావారు బాగా లేట్ అయ్యింది కనుక స్వామి సమాధి దర్శనం ఇప్పుడు వీలవదు అన్నట్లు చెప్పారు. కాని మళ్ళీ యు.ఎస్. వెళితే ఎప్పుడు వస్తామో తెలీదు కనుక 2 ని॥లలో దర్శనం చేసుకుని వస్తానని చెప్పాను. మావారు సరేనన్నారు. ఫారెస్ట్ ఏరియా బాగా లేటయ్యింది. పిల్లలకు తినడానికి కూడా ఏమి తీసుకోలేదు. ఇక్కడ ఏమీ దొరకవు. ఎలాగా అనుకుంటూ నేను దర్శనానికి 'ఓం సాయినాథ జై! గురు భరద్వాజ జై' అని నామం చెప్పుకుంటూ వెళ్ళాను. సరిగ్గా సమాధి మందిరం ముందు కారు దిగేసరికి అక్కడ ఒకరు నిలబడి వున్నారు. మమ్మల్ని సాదరంగా ఆహ్వానించి పూర్ణానందస్వామివారి సమాధి మందిరము, ఆయన నివసించిన ఇల్లు, వాడిన వస్తువులు– అన్నీ చూపించి, "రండి, భోజనము వడ్డిస్తున్నాము" అని పిలిచారు. "లేదు, లేదు మేము వెంటనే వెళ్ళాలి" అన్నాము.

అందుకాయన, "లేదమ్మా ఎవరైనా వస్తుంటే ముందుగా తెలియపరిస్తేనే ఇక్కడ భోజనానికి ఏర్పాటు చేస్తాము. స్వామి దర్శనానికి వస్తున్నారు. భోజనం ఏర్పాటు చేయమని ఫోన్ వచ్చింది. అందుకే భోజనం సిద్ధం చేసాము" అన్నారు. మేము ఆశ్చర్యపోయి ఎవరు ఫోన్ చేసారు అని అడిగితే 'భరద్వాజ గారు' అని చెప్పారు. నేను ఇంకా ఆర్చర్యపోయి, "భరద్వాజగారా" అని అడిగాను. అందుకాయన, "అవునమ్మా! ఫోన్ చేస్తున్నది ఎవరు అని అడిగితే భరద్వాజ అన్నారు. 'భరద్వాజ' అంటే అని మళ్ళీ అడిగాను. భరద్వాజ ఫ్రమ్ ఒంగోలు, అని ఫోన్ పెట్టేసారు" అని చెప్పాడు!!

పూజ్యశ్రీ మాస్టర్ గారు మాపై చూపిన కరుణకు మేమంతా పొందిన ఆనందానికి అవధులు లేవు"

పూజ్యశ్రీ మాస్టరుగారి ద్వారా ఎన్నో ఇట్టి అద్భుతలీలలు జరుగుతున్నప్పటికీ ఆయన సామాన్య మానవుని వలెనే ప్రవర్తించేవారు. ఎందరో ఆయనను గురువుగా తలచినప్పటికీ ఆయన తాము అలా ఎన్నడూ ప్రవర్తించలేదు. 'గురువుల మవుదామనే గుబులు పుట్టకుండుగాక' అన్నదే చరమ ప్రార్థనగా చెప్పారు.

ఐతే "తనను తాను గురువుగా తలచేవాడు గురువు అన్న పదానికే అనర్హుడు" అని రమణ మహర్షి చెప్పారు. ఆ సిద్ధాంతం ప్రకారమైతే పూజ్యశ్రీ మాస్టరు గారు గురువే కదా!

అంతేకాదు, ఆయన తాము సాయి అనే మిఠాయికి చుట్టిన కాగితంలాంటి వాడినని కూడా చెప్పారు. ఆయన చెప్పిన ఈ మాట వలన ఆయన అహంకారరాహిత్యం వ్యక్తం అవుతుంది గాని దీనిని విశ్లేషించుకుంటే ఆయన నిజతత్త్వం అవగతమౌతుంది. మిఠాయిలాంటి బాబాకు చుట్టిన కాగితం సామాన్యమైనది ఎలా అవుతుంది? సకల జీవుల శ్రేయస్సుకై అవతరించి మిఠాయి వలెనే తమనాశ్రయించిన వారి జీవితాలను మధురవంతములుగా మలుస్తూవున్న సాయి మరి పూజ్యశ్రీ మాస్టరుగారిలో ఏ ఔన్నత్యమూ లేకపోతే ఆయన

దేహాన్ని ఆలంబనగా ఎందుకు చేసుకుంటారు? మరి ప్రపంచంలో ఇన్ని జీవుల శరీరాలు వుండగా ఆయన శరీరాన్నే ఎందుకు ఎన్నుకున్నట్లు? అట్టి దివ్య పురుషుని తత్త్వంతో నిండివున్న పూజ్యశ్రీ మాస్టరుగారి దేహం అప్పుడు దివ్య దేహం గాక మరేమవుతుంది? ఆయన సాయి స్వరూపులు గాక ఇంకేమవుతారు? ఆయనే ఒకసారి అన్నారు: “శ్రీసాయినాథుడు ఈ శరీరంలో అణువణువునా తామే నిండివున్నారు. ఇక నేను కోరవలసిందేమున్నది? ఆయన నడిపించినట్లు నడవడమే!” అని. అందుకే ఆయన సాయి స్వరూపులు.

పూజ్యశ్రీ మాస్టర్ గారు శ్రీసాయినాథుని అనుగ్రహం పొందిన తర్వాత మాత్రమే అందరిలోను బాబానే చూచేవారని అనుకుంటాము కాని చాలా చిన్న వయస్సులోనే ఆయన అలా భావించేవారని ఈ క్రింది సంఘటన వల్ల తెలుస్తుంది.

వారి మూడవ అన్నగారైన శ్రీబోధాయనగారు స్వయంగా చెప్పిన మాటలివి: “మా నాన్నగారు మమ్ములను బడికి పంపక వారి ఆశయం మేరకు తామే గురువై ఇంటివద్దనే శిక్షణనిచ్చి మెట్రిక్యులేషన్ పరీక్షకు కాశీకు తీసుకువెళ్ళారు. ఆ రోజుల్లో బీజాపూర్ మహారాజావారి సంస్థానంలో భయంకరమైన పొగరుబోతు ఏనుగులుండేవి. అవి వస్తుంటే అందరూ భయపడి పారిపోయేవారు. ఒకసారి అవి వస్తుంటే అందరూ భయంతో పక్కలకు పరుగెత్తుతున్నారు. నేను, భరద్వాజ మాత్రం భయపడకుండా అలాగే నిలబడిపోయాము. అలా నిలబడవద్దని, చాలా ప్రమాదమని ఎందరు చెప్పినా పట్టించుకోలేదు. అవి తొండంతో చుట్టి చంపేస్తాయని చెప్పి కొందరు మమ్మల్ని తిట్టారు గూడా. కాని అవి మా దగ్గరకొచ్చి నిలబడ్డాయి. భరద్వాజ వాటి తొండాలమీద చేత్తో నిమురుతూ వున్నాడు. అవి మిమ్మల్ని ఏమీ చేయలేదు. ఒక ఏనుగు తన తొండంతో మా బుగ్గలమీద నిమిరి మాకు నమస్కరించినట్లు తొండాన్ని వంచి వెళ్ళిపోయింది. చూచినవారంతా ఎంతో ఆశ్చర్యపోయి ఎందుకలా చేసాయి? మీకింత ధైర్యం ఎలా వచ్చింది” అని అడిగారు. అప్పుడు భరద్వాజ, “భగవంతుడు సర్వాంతర్యామి గనుక ఆ ఏనుగులలో కూడ ఆయనే వుంటాడు గదా! మనం అవతలవారిని ఏ దృష్టితో చూస్తే అవతలివారుగూడ ఆ దృష్టితోనే చూస్తారు. మనం వాటిని చంపాలనుకుంటే అవిగూడ మనలి చంపాలనే అనుకుంటాయి” అన్నాడు.

ఎందరో మహాత్ముల చరిత్రలలో పొగరుబోతు జంతువులు సౌమ్యమై వారికి నమస్కరించటంవంటి సంఘటనలు మనం చూడవచ్చు.

ఒకసారి పూజ్యశ్రీ మాస్టరుగారు హైదరాబాదులో ఉద్యోగం చేసేటప్పుడు కొంతమంది విద్యార్థులను తీసుకొని దగ్గరలోని అడవిలోకి వెళ్ళారు. ఒక రాత్రి పులిని చూచి భయపడి చెప్పకుండా అందరూ పారిపోయారు. అప్పుడు మాస్టరుగారు ఒక్కరే కొన్ని రోజుల పాటు అక్కడే వున్నారు. అలాగే రాజమండ్రి దగ్గర వున్న పాపికొండలకు తరచూ వెళ్ళి కొన్ని రోజుల పాటు ఆయన అక్కడే వుండిపోయేవారట. అక్కడ ఆయన ఏమి చేసారో ఎవరికీ తెలియదు. ఒకసారి ఆయనే చెప్పారు: “నేను అడవిలోకి వెళ్ళినప్పుడు ఒకసారి ఒక రక్తపింజరి పాము కనిపించింది. అది నన్నేమి చేయక నా ఎదురుకుండా నాట్యం చేసి వెళ్ళిపోయింది.”

క్రూర జంతువులను సైతం సాత్వికంగా మార్చగలిగిన శ్రీ మాస్టరుగారు శ్రీ పాకలపాటి గురువుగారిని “మీకీ అరణ్యాలలో భయం వేయలేదా. మాకెందుకు వేస్తుంది!” అని అడుగుతారు ఎంతో అమాయకంగా అదే ఆయనలోని ప్రత్యేకత.

ఆయన తమ నిజతత్త్వం గురించి కొన్ని సందర్భాలలో మర్మగర్భంగా చెప్పకపోలేదు. ఒకసారి ఒక వ్యక్తి మాస్టర్‌గారి మీదకి కొట్టడానికి వస్తూ



కోపంగా, "నీ అంతు చూస్తాను" అన్నాడు. అప్పుడు పూజ్యశ్రీ మాస్టర్ గారు ఏ మాత్రం చలించక, "నా అంతు చూడాలని వీరెవ్వరికీ రాని ఆలోచన నీకు వచ్చిందే! ఐనా మనిద్దరి అంతు ఒక్కటే" ! అన్నారు. అంటే ప్రతి వ్యక్తిలోను వున్న పరిమితమైన 'నేను' యొక్క అంతును (మూలాన్ని) చూస్తే అంటే పరిశోధిస్తే అందరిలోను వున్న, అంతాయైన ఆత్మ ఒక్కటే అనుభవమవుతుంది అని అర్థం.

పూజ్యశ్రీ మాస్టరుగారితో చదువుకున్న సాటి విద్యార్థి డి. రాఘవరావు యిలా చెప్పాడు: "భరద్వాజ ఎప్పుడూ ప్రతి విషయాన్నీ విమర్శనాత్మక దృష్టితో చూచేవాడు. ఒకసారి మాటల సందర్భంలో, "నేను అనే దేహభావంవల్ల ఒకదానితో అసోసియేట్ (associate) అయ్యేసరికి రాగము, ద్వేషము కలుగుతాయి. ఆ దేహభావం నుంచి విడివడితే ఇవేవీ వుండవు" అని చెప్తుంటే, "ఓహో! బయల్దేరాడు వేదాంతి" అని ఎగతాళి చేసేవాళ్ళం. అతని ఆలోచనా సరళి మామూలు స్థాయిని దాటి వుండేది." అంటే అప్పటికే ఆయన స్థాయి ప్రాపంచిక పరిధులు దాటి ఉన్నత స్థితిలో వుండేది అన్న విషయం సుస్పష్టం.

నేను పరిమితమైన వ్యక్తిని అన్న భావం విడివడ్డవారు పరమాత్మే అవుతారు. అట్టి వారే మహాత్ములు. అట్టి మహాత్ములే పూజ్యశ్రీ మాస్టరుగారు. మరి ఆయన ప్రాపంచిక వ్యవహారాలన్నీ చేసేవారు కదా అని కొందరికి అనిపించవచ్చు. ఆయనను బాబా ఆ స్థాయిలో వుంచారు. శ్రీరామకృష్ణ పరమహంసను అమ్మ లౌకిక, పారలౌకికానికి మధ్య స్థితిలో వుంచారట. పూజ్యశ్రీ మాస్టర్ గారిని బాబా ఇటు లౌకిక స్థాయి, పారమార్థిక స్థాయి – రెండింటిలోనూ ఒకేసారి వుండేటట్లు వుంచారనిపిస్తుంది. అలా కాకపోతే ఆయన ఏ చీరాలస్వామిలాగానో, వెంకయ్య స్వామి లాగానో, నాంపల్లి బాబా లాగానో వుండేవారేమో! సమర్థ సద్గురుడైన శ్రీ సాయినాథుడు తాము సంకల్పించిన లోకకళ్యాణార్థం తమ వారసులుగా ఆయనను నిలిపారు. అందుకే ఆయనను తమ శిష్యునిగా, ఆత్మజునిగా (బిడ్డగా) ఎన్నుకున్నారు.

అన్నీ విడిచి దేశాటన చేస్తూ (అవధూతగా) తిరగాలనుకున్న ఆయనను సాయి అలా మలచారు. అందుకే ఆయన జీవన్ముక్తుడు.

పూజ్యశ్రీ మాస్టరుగారు ఎప్పుడూ ఎంతో ప్రశాంతంగా వుండేవారు. విసుగు, చిరాకు అనేవి ఆయనలో కనిపించవు. ఎవరు ఎటువంటి ప్రశ్న వేసినా ఓర్పుగా సమాధానం చెప్పేవారు. ఆఖరికి చిన్న పిల్లలు సైతం, "అంకుల్ మీరేం చదువుకున్నారు?" "మీరు మాతో ఆడుకుంటారా" అని అడిగితే కూడా ఆయన ఎంతో ప్రేమగా బదులు చెప్పేవారు. చిన్న పిల్లలంటే ఆయనకు ఎంతో ముద్దు. వాళ్ళను ఎంతో ముద్దు చేస్తూ వారి వయస్సుకు తగినట్లు వారితో కలిసిపోయి మంచి విషయాలు చెప్పేవారాయన. ఒకసారి ఏడవ తరగతి చదువుతున్న బి.వి. రమణయ్య అనే పిల్లవాడు మాస్టర్‌గారి గురించి విని చూడాలనిపించి ఆయనకు ఉత్తరం వ్రాసాడు. "సార్! నేను నిన్ను చూడటానికి వస్తున్నా. నువ్వు తప్పక వుండాలి" అని. అది చదివి మాస్టరుగారు అక్కడ వున్న వారితో, "ఈ పిల్లవాడు నన్ను చూడటానికి వస్తున్నాడట. నేను వుండాలట!" అంటూ నవ్వుతూ ఎంతో ప్రేమగా అన్నారు. అతడు వచ్చినప్పుడు అతనితో చాలాసేపు మాట్లాడి వాళ్ళ ఊళ్ళో సత్సంగాలు చేయమని చెప్పారు.

ఆయనకు తమ స్థాయి గురించిన ఆలోచనే వుండేదిగాదు. అలా వుండటానికి ఆయనకు తాను తప్ప ఈ సృష్టిలో అన్యమనేది వుంటేనే కదా. అందుకే పూజ్యశ్రీ మాస్టరుగారికి ధన, కీర్తి, స్త్రీ వ్యామోహాలు లేవు. ఎంతటివారినైనా ఈ వ్యామోహాలు పతనం చెందించటం ఈ ప్రపంచంలో చూస్తూనే వున్నాం.

అందుకే ఆయనకు ధనం సేకరించి ఆశ్రమాలు నిర్మించాలనే తలంపు వుండేది కాదు. ఒకసారి పూజ్యశ్రీ మాస్టరుగారితో ఒకరు, "ఇతర దేశాలకు వెళితే చాలా డబ్బులొస్తాయి సార్. అలా వెళితే బాగుంటుంది గదా" అన్నాడు. అందుకు ఆయన, "వస్తే ఏం చేస్తామట! ఆ డబ్బులతో ఆశ్రమం లేస్తుంది. తర్వాత తగువులాటలు వస్తాయి. అందుకు కాదు వెళ్ళవలసింది. ధర్మప్రచారం కోసం వెళ్ళాలి. మనం చేయవలసినది ధర్మప్రచారమే. అందుకుగాను ముందు మనం ధర్మవర్తనులం కావాలి. అప్పుడే ధర్మప్రబోధం సక్రమంగా జరుగుతుంది" అన్నారు.

స్త్రీల పట్ల ఆయన ఎంతో గౌరవంగాను, ఆప్యాయంగానూ ప్రవర్తించేవారు. 'అమ్మా' అనో, 'అమ్మాయి' అనో పిలిచేవారు. ఆ పిలుపు ఒక తండ్రి తన బిడ్డను పిలుస్తున్నట్లుండేది.

అధర్మాన్ని ఎదుర్కొనడంలో ఆయన ఆత్మవిశ్వాసం అత్యున్నతమైనది. విద్యార్థి దశలోను, ఉపాధ్యాయ వృత్తిలోను, సమాజంలో జరిగే అన్యాయాలను ఎంతో ధైర్యంతో ఎదుర్కొనేవారాయన. నాస్తిక, హేతువాదులతో

వారి సిద్ధాంతాలు ఎంత అసంబద్ధమైనవో సశాస్త్రీయంగా నిరూపించారు. పరమత ద్వేషంతో ప్రజలను ప్రక్కదారి పట్టిస్తున్న వారిని వారి వారి మతాలలో చెప్పినవాటితోనే ఎత్తి చూపి వారు చెప్పినది ఎంత అసంబద్ధమో నిరూపించేవారు.

ఆయన కాలేజీలో చదువుతున్నప్పుడు కొందరు విద్యార్థులు, విద్యార్థినులు కలిసి విహారయాత్రకు వెళ్ళాలనుకున్నారు. పూజ్యశ్రీ మాస్టరుగారికి ఆ పద్ధతి నచ్చలేదు. అంతేగాక అది సరైనది కాదని వారికి తెలియజెప్పాలనుకున్నారు. చివరకు వెళ్ళే రోజు రానే వచ్చింది. ఆ రోజు ఉదయం మిగిలినవాళ్ళతో కలవక ఆయన తమ గదిలోనే వుండిపోయారు. ఎంతసేపటికీ రాకపోయేసరికి ఒక స్నేహితుడు కారణమడిగాడు. "ఏమిలేదు, నేను రావటంలేదు" అన్నారాయన. కారణం చెప్పమంటే కూడా చెప్పలేదు. అతడు బలవంత పెట్టేసరికి చివరకు ఆయన, "ఏమీ లేదు. నేను మీ చెల్లెలిని తీసుకుని వేరే చోటికి వెళ్తున్నాను" అని చెప్పారు. వెంటనే అతనికి విపరీతమైన కోపం వచ్చి ఇష్టమొచ్చినట్లు తిట్టాడు. అప్పుడు పూజ్యశ్రీ మాస్టరుగారు ప్రశాంతంగా, "నేను మీ చెల్లెలితో వెళతానంటే నీకెంత కోపం వచ్చిందో చూడు! మరి మనతోవచ్చే ఆడపిల్లలు కూడా మరొకరికి చెల్లెళ్ళే గదా! మరి నేను చేసేది అధర్మమైనప్పుడు మీరు చేసేది ధర్మమెలా అవుతుంది?" అన్నారు.

అలాగే ఆయన తమ కళ్ళ ఎదుట అధర్మం జరుగుతుంటే సహించేవారు కాదు. ఒంగోలులో మన ఇంటికి ఎదురుగా వున్న గుడిసెలో నివసించే ఒక వ్యక్తి తాగి భార్యను తరచూ కొడుతుండేవాడు. ఒకరోజు అతడు ఆమెను రోడ్డు మీదకు ఈడ్చుకొచ్చి మరీ చావబాదుతున్నాడు. ఇంట్లో సత్సంగం చేస్తున్న పూజ్యశ్రీ మాస్టరుగారికి ఆమె అరుపులు వినబడ్డాయి. "ఏమిటి గొడవ?""అని అడిగారు. అక్కడివారు విషయం చెప్పారు. వెంటనే ఆయన లేచి త్వరత్వరగా అక్కడకు వెళ్ళి అతనిని, "ఏమి చేస్తున్నావు నువ్వు? ముందు కొట్టడం ఆపు!" అని గదమాయించారు. పూజ్యశ్రీ మాస్టరుగారిని



చూసేటప్పటికి అతను ఆపి ఏదో చెప్పబోతుంటే, "అదంతా తర్వాత ఆలోచిద్దాం. ఇలా కొట్టడం ఎప్పుడూ చేయవద్దు. నేను సహించను" అని గట్టిగా చెప్పి లోపలికి వచ్చారు.

గురువుగా ఒక ఉన్నత స్థాయిలో వున్న ఆయన ఆ గుడిసెలోని వారి సంగతి అలా పట్టించుకోవడం చూచిన అందరూ ఆశ్చర్యపోయారు.

ఆయన అతి నిడారంబరులు. సామాన్య మానవునిలా వుండే ఆయన ప్రవర్తనవల్ల ఆయన మహత్మ్యాన్ని గుర్తించటం కష్టతరమే. కాని అత్యంత జ్ఞానపూరితమైన వాక్పటిమ, అనంతమైన తపోశక్తి ఆయన ఔన్నత్యాన్ని ప్రజ్వలింపచేసేవి. ఆయన మాట్లాడుతుంటే అవి వేదప్రోక్తమైన అక్షర సత్యాలుగా గోచరమయ్యేవి. తేజోవంతమైన ఆయన నేత్రాలు ఎదుటివారి అంతరంగపు లోతులను స్పృశిస్తున్నట్లు అనిపించేవి.

ఆయన వేషం అతి సామాన్యం. ఇంట్లో వున్న సమయాలలో లుంగీ, చేతుల బనీను లేక అరచేతుల చొక్కా; బయటకి వెళ్ళినప్పుడు పంచె, చొక్కా. తనచెంతకు ఎంతటివారు వచ్చినా ఆయన వేషంలో ఎలాంటి మార్పూ వుండేదిగాదు. ఆయనకు ఎలాంటి ఆరాటాలూ లేవు. నేలమీదనే కూర్చునేవారు. రంగుల దారాలతో అల్లిన గోనెపట్టాయే వారి ఆసనం. అక్కడ పడుకోటానికి ఒక దిండు, సిగిరెట్టు పెట్టె, యాష్ ట్రే (ash tray), చదువుకునేందుకు, వ్రాసుకునేందుకు పుస్తకాలు వుండేవి. ఎప్పుడూ ఆ ఆసనంపై కూర్చొని మాట్లాడుతూనో, చదువుకుంటూనో, వ్రాసుకుంటూనో వుండేవారు.

సామాన్యమైన జీవితం, అత్యున్నతమైన భావాలు కలిగివుండటమే ఆయన ప్రత్యేకత. ఇట్టి జీవిత విధానమే ఆయన ఔన్నత్యాన్ని అత్యధిక ప్రజానీకం గుర్తించలేకపోవటానికి కారణమైంది.

శ్రీ శిరిడీ సాయిబాబా విషయంలో వలెనే కాలమే పూజ్యశ్రీ మాస్టరుగారి సత్యవాక్కులను, ఔన్నత్యాన్ని నిరూపిస్తుందనడంలో ఎటువంటి సందేహము లేదు.

శ్రీ సాయినాథుడు నైష్ఠిక బ్రహ్మచారి. అవధూత స్థితిలో వున్న ఆయన నిర్వహించ వీలుపడని లోకకళ్యాణ కార్యక్రమాన్ని నిర్వర్తించటానికై పూజ్యశ్రీ మాస్టరుగారిని ఎన్నుకున్నారనిపిస్తుంది. కారణం సంసారులైన మానవులకు బాబాను అనుసరించడం ఎంతో కష్టం.

శ్రీ సాయిబాబాకు ఎటువంటి లౌకిక బంధాలు, సంబంధాలూ లేవు. కనుక ఒక గృహస్థుగా భార్యాబిడ్డల బాధ్యత నిర్వహించవలసిన అవసరం ఆయనకు లేదు. పూజ్యశ్రీ మాస్టరుగారు సంసారిగా జీవించారు గనుక ఆయన మనకు అనుసరణీయులు, ఆదర్శనీయులు.

ఆయన భార్యాబిడ్డల పట్ల, బంధువుల పట్ల, సమాజం పట్ల తమ బాధ్యతలను, కర్తవ్యాన్నీ సంపూర్ణంగా నిర్వర్తించారు. ఐతే ఆయన కర్మలనన్నిటినీ చేస్తున్నప్పటికీ నిష్క్రియులు. ఎన్నో బంధాలలో చిక్కుకున్నట్లు కనిపించినప్పటికీ ఆయన బంధరహితులు.

లౌకిక వ్యవహారాలతోను, చిక్కు సమస్యలతోనూ తలమునకలౌతున్నట్లు వున్నప్పటికీ ఆయన ప్రశాంతచిత్తులు.

ఆధ్యాత్మికత స్థాయిలో సాధన, సాయి ప్రచారం నూటికి నూరుపాళ్ళు ప్రయత్నించినట్లుగానే ప్రాపంచిక విషయంలో గూడా ప్రయత్నం చేసేవారాయన. "మనవంతు కర్తవ్యాన్ని అన్ని విషయాలలోనూ సంపూర్ణంగా నిర్వర్తించ వలసిందే. అలా చేయనివాడు ఆధ్యాత్మికతకు పనికిరాడు" అని ఆయన చెప్పేవారు.

ఆయనకు అన్ని మత సాంప్రదాయాలు తెలుసు. ఏ మతంవారు వచ్చినా ఆయా మతాలలోని మహనీయులు, ఏమి బోధించారో వివరించి, వాటిని ఎలా ఆచరించాలో బోధించారు.

చిన్న పిల్లల దగ్గరనుంచి పెద్దవారివరకు ఎవరికి తగిన సాధనను వారికి చెప్పేవారు. ఆయన శ్రీసాయి చరిత్ర, శ్రీగురు చరిత్ర పారాయణ మాత్రమే చెప్పేవారని కొందరనుకునేవారు. ఉదాహరణకు ఒకామెకు వారు ఏ ఊరికి వెళ్ళినా ఆ గ్రామదేవతను పూజించమని చెప్పారు. మరొకరికి వారి కుల దేవతనారాధించమని, మరొకరికి విష్ణు సహస్రనామం చేసుకోమని, గాయత్రీ మంత్రం చేసుకోమని చెప్పేవారు.

ఆయన ప్రధానమైన బోధ – ఆధ్యాత్మికత అంటే ఏమిటో అందరూ తెలుసుకోవాలన్నదే. నేటి సమాజంలో దొంగ గురువులు ప్రబలమై అమాయక ప్రజలను పక్కదారి పట్టిస్తూ, మోసం చేస్తున్నారని, కనుక అసలైన సద్గురువు ఎలా వుంటారో తెలియజెప్పాల్సిన అవసరం ఎంతైనా వుందని చెప్పేవారు.

అట్లాగని ఆయన తమచెంతకు ఎవరినీ రమ్మని అనలేదు, రావద్దని అనలేదు. తమ వద్దనుంచి వెళ్ళిపోయిన వారిని వారించనూలేదు. అంతా తామే అయిన స్థితిలో వున్న ఆయనకు అసూయద్వేషాలు ఎలా వుంటాయి? ఎవరు ఎవరిని కోపగిస్తారు? అంతా తామే అయినప్పటికీ సకల జీవుల శ్రేయస్సుకొరకే ఒక దేహం ధరించి వచ్చారు. గనుక బిడ్డ తనను ప్రేమించినా, ప్రేమించకపోయినా బిడ్డ శ్రేయస్సు కోసం తల్లి ఎలా తాపత్రయపడుతుందో అలాగే పూజ్యశ్రీ మాస్టరుగారు గూడ తాపత్రయపడేవారు.

**ఇంతకూ ఆయన ఎవరు?**
**పైన చెప్పుకున్న వాటి దృష్ట్యా చూస్తే**
**ఆయన వ్యష్టికాదు. సమిష్టి.**
**వ్యక్తి గాడు, అవ్యక్తుడు.**
**అంతా తానే అయిన ఆత్మస్వరూపులు.**
**అంటే సమర్థ సద్గురుదైన సాయి స్వరూపులు**
**అందుకే ఆయన 'శ్రీ సాయిమాస్టర్!'**

అయితే ప్రస్తుత మన కర్తవ్యం ఏమిటి అన్నది ప్రశ్న? మొదటగా మనకు లభించిన గురువు అంటే పూజ్యశ్రీ మాస్టరుగారు ఎంతటి వారో అనుక్షణమూ గుర్తుపెట్టుకోవాలి.

భ్రష్ట గురువుల బారినపడకుండా భగవంతుడు మనలను ఎంతగా అనుగ్రహించాడో అర్థం చేసుకోవాలి. అందుకని ఈ అవకాశాన్ని చేజారిపోకుండా, చేతులారా పాడుచేసుకొనకుండా ఆయన చెప్పిన, చేసి చూపిన ప్రతి చిన్న విషయాన్ని తరిచి తరచి ఆలోచించి మన శాయశక్తులా ఆచరించటానికి ప్రయత్నించాలి. ఈ ఎనభైయవ (80వ) జన్మదిన సందర్భంగా మనలను సరియైన మార్గాన చేయి పట్టుకుని నడిపించమని, తమ ఆశీస్సులు మనందరికీ నిరంతరం ప్రసాదించమని పూజ్యశ్రీ మాస్టర్ గారిని ప్రార్థిస్తూ....

జై సాయి మాస్టర్!!

**(అక్టోబరు 2017 సాయిబాబా మాసపత్రిక నుండి పునర్ముద్రితము)**

# మనందరికీ అమ్మ మాతృశ్రీ అలివేలు మంగమ్మ

***శ్రీమతి శ్రీదేవి***

"అమ్మా! నమస్కారం" అంటూ ఒక విశాలమైన హాలు లోకి ప్రవేశించింది ఒక మహిళ. అక్కడ మంచంపై కూర్చుని వున్న మాతృశ్రీ అలివేలు మంగమ్మ వద్దకు వచ్చి ఆమెకు నమస్కరించింది. ఆకుపచ్చ రంగు చీరలో నుదుట ఉదయ సూర్యుని వలె వెలుగుతున్న కుంకుమ బొట్టుతో దివ్యకాంతులతో వెలిగిపోతున్న అలివేలుమంగామాత చిరునవ్వులొలికిస్తూ తన యెదుట కూర్చున్న ఆ స్త్రీని ఆప్యాయంగా పలకరించారు. ఆమె యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఆ తర్వాత ఆమె తమ సమస్యలను అమ్మగారికి విన్నవించుకొని, "అమ్మా! ఈ కష్టజీవితాన్ని యిక మోయలేను. నాకింక మరణమే శరణ్యమనిపిస్తున్నది. చివరి యత్నంగా ఆశతో మీ పాదాల వద్దకు వచ్చాను. నీట ముంచినా పాల ముంచినా మీదే భారం" అంటూ దుఃఖించింది. శ్రీ అమ్మగారు ఆమెను ఓదార్చారు. ఆమెకు అభయమిచ్చి పంపారు. అంతే! కొద్దిరోజుల తర్వాత ఆమె మరల శ్రీ అమ్మగారి దర్శనార్థం వచ్చి "అమ్మా ఆ రోజు నేను మీ వద్దకు వచ్చి వెళ్లాను. మీరు చెప్పిన నియమనిష్ఠలు పాటిస్తూ 'శ్రీ సాయి చరిత్ర' 'శ్రీ గురుచరిత్ర' లు పారాయణ చేశాను. ఆశ్చర్యంగా నా సమస్యలు అన్నీ తొలగిపోయాయి. అమ్మా! మీ దయ సాటిలేనిది. జన్మజన్మలు నన్ను యిలాగే కాపాడుతుండండి" అంటూ ఆమె తన ఆనందబాష్పాలతో అమ్మ పాదాలు అభిషేకించింది.

ఈ విధంగా స్త్రీలు, పురుషులు, ఆర్తులు, జిజ్ఞాసువులు – యెందరో మాతృశ్రీ అలివేలు మంగమ్మను దర్శిస్తుండేవారు. కొందరు ఆమె యింటిలోనే కొన్ని రోజులు వుండిపోయేవారు కూడా! అలా శ్రీ మాస్టరుగారి, అమ్మగారి సన్నిధి భాగ్యాన్ని తృప్తిగా అనుభవించి దైవచింతనను, పవిత్రభావాలను హృదయాలలో నింపుకొని వెళ్తుండేవారు.

తల్లిదండ్రుల యింటి తలుపులు యెల్లప్పుడూ తమ బిడ్డల కోసం తెరిచే వుంటాయి. వారు తమ కన్నబిడ్డలు జీవనపోరాటంలో అవసరార్థం దూరప్రాంతాలలో నివసిస్తూ, తమకు దూరంగా వుంటున్నప్పుడు ఆ పిల్లల



రాకకై వేయికళ్లతో యెదురు చూస్తూనే వుంటారు. అదేవిధంగా ఈ సృష్టి అంతటికీ తల్లిదండ్రులైన శ్రీ భరద్వాజ గురుదేవులు, మాతృశ్రీ అలివేలుమంగమ్మ తల్లి కూడా తమ వద్దకు వచ్చిన భక్తులను కన్నబిడ్డల వలె ఆదరించేవారు.

తల్లి ప్రేమకు యేదీ సాటిరాదన్న విషయం లోకవిదితం. తండ్రి పట్ల పిల్లలకు యెంతో కొంత గౌరవంతో కూడిన భయం వుండవచ్చు. కానీ తల్లి విషయంలో పిల్లలు పరిమితులు, సరిహద్దులు లేని ఆమె ప్రేమలో పొందే సంతృప్తి సాటిలేనిది. ఇక విశ్వజనని ప్రేమకు సరిసాటి యేముంటుంది?

భక్తులు ఆమె సన్నిధిలో, ఆమె ఆదరణలో యెంతగానో సేదతీరి తమ బాధలను మరచిపోయేవారు.

శ్రీ అలివేలు మంగామాత తన వద్దకు వచ్చిన భక్తులకు యెన్నో ఆధ్యాత్మిక విషయాలు బోధించేవారు. ఒకసారి ఒక భక్తురాలు అమ్మగారిని "అమ్మా! ధర్మం అంటే యేమిటి?" అని అడిగింది. అమ్మగారు ధర్మాచరణ గురించి వివరించి, చివరగా "ఇతరులు మన పట్ల యెలా ప్రవర్తించాలని మనం కోరుకుంటామో అదే విధంగా మనం యితరుల పట్ల ప్రవర్తించటమే ధర్మం" అన్నారు. ఇలా అమ్మగారు నిరంతరం భక్తులకు సద్బోధలు చేస్తూనే, మరొక ప్రక్క తమ యింటికి వచ్చినవారికి సౌకర్యాలను, తగిన సదుపాయాలను కలిగిస్తూ వుండేవారు. తమ యింటికి వచ్చిన వారికి యెలాంటి యిబ్బంది కలగకూడదన్న వుద్దేశంతో జాగ్రత్తలు తీసుకునేవారు. ఒక సాధారణ గృహిణి వలె వారి ప్రతి చిన్న అవసరాన్ని గమనిస్తూ, వారి ఆహార విహారాలలోనే గాక, అనారోగ్యంగా వున్న వారి పట్ల కూడా తగు శ్రద్ధ వహించేవారు. ఈ విధంగా తమ యింటికి వచ్చిన భక్తులను యింతగా ఆదరించటం లోకమాత అయిన శ్రీ అలివేలు మంగమ్మ తల్లి కి మాత్రమే సాధ్యం అనేది యెంత మాత్రం అతిశయోక్తి కాదు.

శ్రీ అమ్మగారు నిరంతరం శ్రీ మాస్టరుగారి గురించి ఆయన దివ్య బోధనలను గురించి వివరిస్తుండేవారు. ఆయనలోని ప్రేమ తత్వాన్ని గురించి చెబుతూ, ఆయన ఒక గురువుగా, దైవంగా మాత్రమే కాదు, ఒక కన్నతల్లి వలె తమ వద్దకు వచ్చే భక్తులను ఆదరించేవారని చెప్పేవారు. అందుకు వుదాహరణగా అమ్మగారు ఒక విషయం యిలా చెప్పారు. "ఒకసారి కొందరు యువకులు శ్రీ మాస్టరుగారి వద్దకు వచ్చి ఆధ్యాత్మికత గురించి యెంతో వ్యంగ్యంగా, హేళనగా మాట్లాడసాగారు. శ్రీ మాస్టరుగారు యెంతో ఓర్పుతో వారి ప్రశ్నలకు సమాధానాలు యివ్వసాగారు. అలా గంటలు గడిచి పోసాగాయి. ఆ యువకులు అలా వాదిస్తూనే వున్నారు. అక్కడవున్న భక్తులు ఆ యువకులతో కోపంగా మాట్లాడబోతే శ్రీ మాస్టరుగారు వారిని వారించారు. అర్ధరాత్రి వరకు ఆ సంభాషణలు కొనసాగాయి. ఆ యువకులలో కొంత మార్పు వచ్చింది. అంతకు ముందువరకు వారిలో శ్రీ మాస్టరుగారిపై వున్న నిర్లక్ష్యభావం తొలగిపోయింది. వారు భక్తితో శ్రీ మాస్టరుగారికి నమస్కరించుకుని, శ్రీ మాస్టరుగారి వివరణలతో ఆధ్యాత్మికత పట్ల తమకున్న అభిప్రాయం మారిందని చెబుతూ ఆయనకు క్షమాపణలు చెప్పుకొని వెళ్లిపోయారు. ఒక మాతృమూర్తి



వలె యిటువంటి వితండవాదుల పట్ల ఆయన అంతులేని సహనంతో వ్యవహరించేవారు. వారి పట్ల కొంచెం కూడా విసుగు చెందేవారు కాదు. ఎలాగైనాసరే వారిని సమాధానపరిచి సంస్కరించాలన్నదే వారి తాపత్రయం. 'ఏ స్త్రీ అయినా, యే తల్లి అయినా తమ ముద్దుబిడ్డల కోసం యింత ఓర్పుగా యింత సమయం వెచ్చించగలరా?' అని సందేహం కలుగుతుంది. అలాంటి సన్నివేశాలను ప్రత్యక్షంగా చూసినప్పుడు నాకు యిలా అనిపిస్తుంది – ఆయన ప్రేమ మాతృప్రేమను మించినదని".

ఒక భక్తుడు, "అమ్మా మానవుని ముఖ్య కర్తవ్యం యేమిటి?" అని అడిగినప్పుడు శ్రీ అమ్మగారు – "ప్రతివారు తమ సాటివారికి వారి అవసరాలలో సహాయపడుతూ, వారి ఆపదలలో ఆపన్న హస్తము అందిస్తూ ఆదుకోవటం ప్రధాన కర్తవ్యం. ఒక సందర్భంలో మునులు సూత మహామునితో, "స్వామీ! మానవుడు అతి సులభంగా తరించే మార్గం సెలవివ్వండి" అని అడిగారు. అందుకు సూత మహాముని, "పరోపకారం అనే సద్గుణం చేత మానవులు తప్పక సులభంగా మోక్షాన్ని పొందగలరు" అని సమాధానం యిచ్చారు. కనుక ప్రతివారు తమ వరకు, తమ


సౌఖ్యం కొరకు మాత్రమే పరిమితం కాక చేతనైనంతగా యితరులకు సహాయపడాలి. అయితే ఈ సహాయాన్ని మనం మన సాటి మానవుల కోసం చేస్తున్నామని అనుకోకూడదు. సకల రూపాలలో వున్న సాయిబాబాకు సేవ చేస్తున్నామనే భావనయే మనం మన మనసులో నింపుకోవాలి. ఉదాహరణకు ఒక బిచ్చగానికి మనం భిక్ష సమర్పించామని అనుకుందాము. నిజానికి యెవరు యెవరికి యేమి సమర్పిస్తున్నట్లు? ఈ విషయం లోతుగా ఆలోచిస్తే ఈ సర్వ సృష్టి యెవరి చేత సృజింపబడిందో ఆ భగవంతుడే భిక్షగాని రూపంలో వున్నాడని అర్థమవుతుంది. నీవు సమర్పిస్తున్న ఆ భోజన పదార్థాలు నీవు సృష్టించలేదు. భూమిలో పుట్టి పెరిగిన పంటలు, బియ్యము, కూరగాయలు, దానిని వుడికించిన అగ్ని, నీరు, గాలి యివన్నీ కలిసి నీకు భోజనం సిద్ధం చేస్తే – నీవు భిక్షగానికి దానిని సమర్పించావు. సమర్పించిన నీలో వున్నది, స్వీకరించిన ఆ భిక్షగానిలోనూ వున్నది భగవంతుడే! ఇక యెవరు యెవరికి యేమి యిస్తున్నారు? అంతా దైవం ఆడుతున్న లీలానాటకం. కనుక పరోపకారం చేస్తూ, 'నేను యితరులకు చేస్తున్నాను' అన్న భావాన్ని తీసివేసి, అంతా దైవమే అన్న భావంతో మనసుని నింపుకోవాలి" అంటూ అమ్మగారు యెంతో చక్కగా వివరించారు.



ఒకసారి అమ్మగారు ప్రసంగవశాత్తు పెద్దల ఆశీస్సులు అనే విషయాన్ని గురించి చెప్పిన విధానం చాలా వినూత్నంగా అనిపిస్తుంది. "ప్రతి సందర్భంలోనూ పెద్దల ఆశీస్సులు తీసుకోవడం అనేది మన సాంప్రదాయం. ఈ సాంప్రదాయ పాలనలోని అంతర్యం యెంతో గొప్పది. సాధారణంగా పెద్దలు చిన్నవారి క్షేమాన్ని కోరుతూ, వారికి శుభం కలగాలనే వుద్దేశంతో వారిని దీవిస్తూ వుంటారు. అయితే యెవరు యీ పెద్దలు? పెద్దలు అని యెవరిని అనాలి? అన్న విషయం ఆలోచించాలి. వయస్సులో మనకంటే పెద్దవారిని మాత్రమే మనం పెద్దలు అనటం సర్వసాధారణం. అయితే లోతుగా ఆలోచిస్తే వీరు మాత్రమే కాదు, మనలోలేని దివ్య గుణాలు కలిగి వున్నవారు, యే విషయంలోనైనా మనకంటే యెక్కువ పరిజ్ఞానం కలిగి వున్నవారు – వీరిని కూడా మనం పెద్దలు అని భావించవచ్చు. అంతేకాదు, సృష్టిలోని ప్రతిదీ మనకంటే వున్నతమైనది మనం గౌరవించదగినది అయివున్నది. ఎందుకంటే సృష్టి సమస్తము మనకు వుపయోగపడుతున్నది. పంచభూతాలతోనే మన దేహం నిర్మింపబడటమే కాదు; ఆ పంచభూతాలు, ప్రకృతి వలననే మనం జీవించగలుగుతున్నాము. వాటి పైననే ఆధారపడి మనం జీవిస్తున్నాము. కనుక మనకు జీవితాన్ని అందిస్తూ మనలను ఆశీర్వదిస్తున్న యీ సృష్టిలోని పదార్థాలన్నింటినీ మనకు పెద్దలుగానే భావించాలి. పెద్దల ఆశీస్సులు పొందటమే కాదు, పెద్దలపట్ల మనం యెలా వ్యవహరించాలన్నది ముఖ్యమైన విషయం. పెద్దలను గౌరవిస్తూ నిరంతరం పెద్దలపట్ల కృతజ్ఞతతో వ్యవహరించడం మనం మరవకూడదు. అది మన ముఖ్య కర్తవ్యం" అని చెప్పారు శ్రీ అమ్మగారు.

మాతృశ్రీ అలివేలు మంగమ్మ గురుమహిమ గురించి చెబుతూ, "గురుమహిమ అపారమైనది. ఈ చరాచర సృష్టి మొత్తం ఆయన మహిమను సూచిస్తున్నది. చూడండి, ఒక కవిలోని కవిత, గాయకుని మధుర గానం, సకల కళలు, సకల విజ్ఞానము ఆయన మహిమకు ప్రతిరూపాలే! ఈ సృష్టి, స్థితి, లయములన్నీ ఆయన మహిమకు చిహ్నాలే!" అన్నారు.

ఒకసారి ఒక భక్తురాలు "అమ్మా! భగవంతుని నమ్ముకుంటే కష్టాలను యెదుర్కోవటమేనా? భగవంతుడు దయామయుడు అని అంటారే, మరి దైవ భక్తులకు కష్టాలు యెందుకు వస్తున్నాయి?" అని ప్రశ్నించింది. శ్రీ అమ్మగారు "భగవంతుని నమ్ముకొనని వారికి కష్టాలు రావడం లేదా? నిజం చెప్పాలంటే కష్టాలు అనుభవించడం వలన కర్మక్షాళన జరుగుతుంది. నిజానికి కష్టాలు, బాధలు అనేవి మనిషిని ఆధ్యాత్మిక సాధన



వైపు మరలిస్తాయి. కష్టాలలోనే మనిషి యెక్కువగా దైవాన్ని స్మరిస్తాడు, ఆశ్రయిస్తాడు. అలా భగవంతునికి చేరువ అవుతాడు. సుఖాలనేవి మనిషిని అహంకారపూరితునిగా మారుస్తాయి. చాలామంది మహాత్ములు తమ యిష్టపూర్వకంగానే కష్టతర జీవితాన్ని యెంచుకొని జీవిస్తుంటారు. అందువలన కష్టాలను శత్రువులుగా చూడవద్దు. దైవస్మరణ మానవద్దు" అని బోధించారు.

శ్రీ అమ్మగారు తమ వద్దకు వచ్చే స్త్రీలకు కుటుంబ సభ్యులతో సామరస్యంగా జీవించవలసిన ఆవశ్యకతను వివరిస్తుండేవారు. వాస్తవంగా గృహిణి పైనే ఆ యింటి సుఖశాంతులు ఆధారపడి వుంటాయి. కుటుంబ సభ్యులందరితో సామరస్యంగా జీవించటం ఒక కళ. అది యెంతో అవసరం కూడా. కుటుంబం సుఖశాంతులతో వుంటేనే దైవచింతన, ఆధ్యాత్మిక సాధన చక్కగా జరుగుతాయి. ఎప్పుడూ తగవులు, చికాకులు వున్న యింట్లో శాంతి అనేది యెక్కడ వుంటుంది?

తిరుపతి సమీపంలోని నారాయణవనం అనే ఊరిలో సొరకాయల స్వామి అనే ఒక అవధూత వుండేవారు. ఆయనను ఒకసారి ఒక భక్తుడు తన యింటికి ఆహ్వానిస్తాడు. అక్కడ ఆయనకు పెద్ద యెత్తున పూజా కార్యక్రమాలు నిర్వహించాలని అందుకు తగిన యేర్పాట్లు చేస్తుంటారు భక్తులు. ఆ సమయంలో 'యెప్పుడూ యెవరింటికీ వెళ్ళని స్వామి నా యింటికి వచ్చారు' అన్న అహంభావం ఆ భక్తుని మనసులో తలెత్తుతుంది. ఆ గర్వంతో ఆ భక్తుడు యితర భక్తులను కించపరుస్తూ మాట్లాడటం మొదలుపెడతాడు. వెంటనే స్వామి లేచి వెళ్ళిపోతుండగా, భక్తులు కంగారుగా "స్వామీ! యెక్కడికి వెళ్ళిపోతున్నారు?" అంటూ ఆయనను ఆపాలని ప్రయత్నిస్తారు. "ఈ యింటిలో దుర్వాసన వస్తున్నది. నేనిక్కడ వుండను" అంటూ అక్కడినుండి వెళ్ళిపోతారు స్వామి. కనుక తగవులు, కీచులాటలు వుండేచోట దైవకృప లభించదు.

కుటుంబంలో వచ్చే చిన్న చిన్న అభిప్రాయ భేదాలను యెంతో సులభంగా పరిష్కరించుకొనవచ్చు. జిల్లెళ్ళమూడి అమ్మ స్త్రీలతో ఒకసారి నవ్వుతూ యిలా అన్నారు: "చూడండి యింట్లోని వారితో పేచీలు రాకుండా వుండటానికి 'యెస్' (YES) మంత్రం వుపయోగించండి. అవతలి వారితో అభిప్రాయ భేదం వచ్చినప్పుడు 'అలాగే' అంటుండండి. స్త్రీలకే సహనం యెక్కువ కదా! కనుక మీరే తగ్గి వారి మాట ప్రకారమే చేయండి. అలా చేస్తుంటే కొన్నాళ్లకు యెదుటి వారే మీ మాటను వినే స్థాయికి వచ్చి, మీ మాటను వారు మన్నించే స్థితి తప్పకుండా వస్తుంది." కనుక స్త్రీలు సహనంతో సామరస్యంతో మెలగటం అవసరం అని చెప్పారు శ్రీ అలివేలుమంగమ్మగారు.

ఈ విధంగా మన మాతృమూర్తి శ్రీ అలివేలు మంగమ్మ భక్తులకు గొప్ప గొప్ప ఆధ్యాత్మిక సందేశాలను సులభమైన రీతిలో వివరిస్తుండేవారు. అమ్మగారి సలహాలతో, దివ్య బోధనలతో, కుటుంబాలలో నెలకొన్న తగవులు పరిష్కారమై వారంతా సుఖశాంతులతో జీవించిన సంఘటనలు యెన్నో !

ఇలా భక్తులకు చక్కని సందేశాలు యిస్తూ, వారిని ఆధ్యాత్మిక బాటలో నడిపించిన విలక్షణమైన మహాత్మురాలు మన అలివేలు మంగామాత!

సర్వాంతర్యామి మన మాతృదేవి జన్మదిన సందర్భంగా మనలను సన్మార్గంలో నడిపించమని, సదా సర్వదా మనలను కనిపెట్టి కాపాడమని వేడుకుంటూ, ఆ తల్లి దివ్య చరణకమలాలకు శతకోటి వందనాలు అర్పిద్దాము!

జై సాయి మాస్టర్!

# మన ఇల్లు

శ్రీమతి అడిదం వేదవతి

నాకు ఊహ తెలిసేటప్పటికి మేము విద్యానగర్ లో వున్నాము. తమ్ముడు ఇంకా పుట్టలేదు. ఇంటి నిండా ఎప్పుడూ చాలామంది వుంటూ వుండేవారు. నాన్నగారు ఎక్కువ సమయం హాలులో కూర్చొని వచ్చిన వారితో మాట్లాడుతూనో, వ్రాసుకుంటూనో, ఏదైనా గ్రంథం చదువుతూనో వుండేవారు. హాలులో కొంతమంది ధ్యానం చేస్తూనో, మాస్టరు గారి మాటలు వింటూనో వుండేవారు. అమ్మ వచ్చినవారికి కాఫీలు, భోజనాలు ఏర్పాట్లు చేస్తూనో, చేయిస్తూనో, వచ్చిన వారితో ఆప్యాయంగా మాట్లాడుతూనో వుండేవారు. ఆ ఇంట్లో నిరంతరం బాబా గురించిన మాటలు, భజనలు, పాటలు వుంటూ వుండేవి. లేదా సత్సంగం వినిపిస్తూ వుండేది. చివరకు నాకు అన్నం పెట్టేటప్పుడు, నాతో ఆడేటప్పుడు, నన్ను నిద్రపుచ్చేటప్పుడు, పాటలతోనే జోడించి ఆ పనులు చేసేవారు. బాగా లేనప్పుడు బాబాను ప్రార్థించి బాబా ఊదీ రాసి, మందులు కూడా యిచ్చేవారు. నాకు కథలు చెప్పినా, అవి మహాత్ముల కథలో, రామాయణ– భారత – భాగవతాలో లేదా సాయి లీలలో భక్తుల అనుభవాలో అయివుండేవి. ప్రతినిత్యం మేమంతా ఏది తిన్నా, త్రాగినా బాబాకు నివేదించే తీసుకునేవారము. ఇంట్లో 'వంట చేయడం' వుండేదికాదు బాబాకు నైవేద్యం చేయడం వుండేది. 'కాఫీ నివేదన, కాఫీ ప్రసాదం' వుండేవి. మహాత్ముల దర్శనమూ, శిరిడీ యాత్రలూ వుండేవి. నిరంతరం సత్సంగము సత్కాలక్షేపమూ మాకు అన్ని వైపుల నుండి వినిపిస్తూనే వుండేవి.

ఉదయమే నిద్రలేచి 'గురు బ్రహ్మ' శ్లోకం చెప్పుకోవడం, ఆ తర్వాత కాలకృత్యాలు తీర్చుకొని ఉదయ హారతికి హాజరు కావడం మా నిత్యకృత్యం. తర్వాత మధ్యాహ్న భోజనం మేమంతా కలిసి చేసే వారము. అప్పుడు కూడా మాస్టరుగారు ఆధ్యాత్మిక విషయాలు మాట్లాడుతూనే వుండేవారు. అవి వింటూనే మేము భోజనం చేసేవాళ్ళము. విద్యానగర్ లో ఎక్కువగా కాలేజీ విద్యార్థులు మాస్టరుగారి సహోపాధ్యాయులు వస్తుండేవారు. వారితో పాటు సాయంత్రం సత్సంగానికి చుట్టుప్రక్కల ఊరి ప్రజలు వచ్చేవారు. అలాగే తేలు కుట్టినవారు, అనారోగ్యంతో బాధపడేవారు, తీవ్రమైన కష్టాల్లో వున్నవారు వచ్చి మాస్టరుగారికి తమ సమస్యలు చెప్పుకుని పరిష్కారము, అభయము, ఆశీర్వచనము తీసుకునేవారు. ఎంతోమందికి చిత్రంగా వారి సమస్యలు తొలగిపోయి వారు కృతజ్ఞతతో ప్రేమతో మళ్లీ మళ్లీ ఆయన దర్శనానికి వస్తూ వుండేవారు. ఇలా ఎప్పుడూ మన ఇంట్లో సందడే సందడి! ఎప్పుడూ పండుగ వాతావరణమే! నిరంతరం సాయిధ్యాసతో ఆ వాతావరణమంతా నిండి వుండేది. ఇక పండుగ దినాలలోను, పర్వదినాలలోను, ప్రత్యేక సందర్భాలలోనూ మరింత తీవ్రంగా సాయి ధ్యాసలో గడిపేవారంతా!

ఇంతటి దీక్షలో ఆ సద్గురు దంపతులైన మా తల్లిదండ్రులు వుంటూ వున్నప్పటికీ మాకు ఎప్పుడూ విసుగనిపించలేదు. కారణం వారు సాయిని నిరంతరం సేవించడమనే జీవితవిధానం ఎంతో సరదాతోనూ, ఆనందోత్సాహంతోనూ సహజంగా జరిగిపోతూ వుండేది. మామూలుగా కుటుంబంలో సాధారణంగా పెద్దలు నిరంతరం పూజ పారాయణాదులతో గడుపుతూ వుండటం వల్ల పిల్లలతో సరిగా సమయం గడపలేకపోవడం చూస్తాము. అందుకని అటువంటి దీక్ష ఎప్పుడవుతుందా అని పిల్లలు ఎదురు చూడడం చూస్తాము. కానీ మన ఇంట్లో అటువంటి సమస్య ఉత్పన్నం కానేలేదు.

కారణం ఆటలు, పాటలు, సరదాలు, సంతోషాలు, యాత్రలు అన్ని వుంటూనే వుండేవి. అయితే అవన్నీ బాబాతో అనుసంధానమై వుండేవి. ఆ ఇంట్లో ఏ వస్తువు ఏ ఒక్కరిదీ కాదు--అందరిదీ!

ఉదాహరణకు, మన ఇంట్లోని బొమ్మలు అందరివీ, తినుబండారాలు అందరివీ, పుస్తకాలు అందరివీ, చాపలు అందరివీ.... అన్ని బాబా ప్రసాదమే! ఆ ప్రసాదాన్ని అందరమూ కలిసి స్వీకరించాలి. అందరమూ తృప్తిగా వుండాలి. ఇలా వుండేది మన సంస్కృతి. కనుక మా దగ్గర వున్న బొమ్మలతో ఇంటికొచ్చిన వారి పిల్లలు ఆడుకోవచ్చు, పాడు చేయవచ్చు కూడా.. నాకు ఏమీ బాధనిపించేది కాదు. 'ఆ ఇల్లు మన అందరి తండ్రి అయిన సాయిది కనుక మన అందరిదీ! ఆయనను అందరమూ కలిసి సేవించాలి. ఇదే ఆలోచనా విధానం ఇంట్లోని అందరిదీ!

అందుకే మాకు ప్రత్యేకమైన బంధుప్రీతి అలవడలేదు. ఎందుకంటే అందరూ గురు బంధువులే కదా! అందరూ మాకు అన్నయ్యలు, అక్కయ్యలు, మామయ్యలు, అత్తయ్యలూ.. వారికి, రక్త సంబంధీకులకి మా మనసులో ఎటువంటి భేదభావం రాలేదు. ఎందుకంటే మా తల్లిదండ్రులకు లేదు గనుక. ఇక కుల మత భేదాలు, ప్రాంతీయ భాషా భేదాలు ఆ ఆప్యాయతను ప్రభావితం చేయలేకపోయాయి. అందరూ మనవాళ్ళే, ఎవరూ పరాయి కాదు - అనేది మాకు తెలియకుండానే మా మనసులలో ముద్రింపబడింది.

ఇదే సంస్కృతి మేము ఒంగోలు వచ్చిన తరువాత కూడా కొనసాగింది. నిరంతరం ఇంట్లో ఉండేవారి సంఖ్య పెరిగింది. వచ్చి పోయే వారి సంఖ్య కూడా. నాన్నగారు కూడా ఎంతో తీవ్రమైన పని ఒత్తిడిలో ఉండేవారు. అయినా మా సరదాలకు, హాయికి ఏమీ లోటు లేదు. పూలజడలు, గోరింటాకులు, పండుగలు, ముగ్గులు, కళలు ఎప్పుడూ ఏదో ఒక సరదా సాయిని సేవించడంలో భాగంగా జరిగిపోయేది. ఇంట్లో ఎప్పుడూ నవ్వులు వినిపిస్తూనే వుండేవి. అందరమూ ఎంతో సంతోషంగా, ఆనందంగా, సరదాగా, ఆడుతూ పాడుతూ వుండేవారం.

అమ్మగారు మాస్టరుగారు కూడా ప్రతి సేవను పరిస్థితిని ఎంతో ఉత్సాహంతో నింపి వేసేవారు. నిరుత్సాహం, నిస్పృహ, అధైర్యం మేము వారిలో ఎప్పుడూ చూడలేదు. ఆర్థిక ఇబ్బందులు, ఉద్యోగ పరమైన ఇబ్బందులు, సామాజిక ఇబ్బందులు, ఎన్నో రకాల మనస్తత్వాల వ్యక్తులతో వ్యవహరించడం వల్ల ఇబ్బందులు... ఇవేమీ అసలు వారిపై ప్రభావం చూపేవి కావు. కనుక మాపై అట్టి ప్రభావం లేనేలేదు. ఇంటి వాతావరణంపై ఎటువంటి ప్రభావం ఉండేది కాదు. అసలలా ఇంటి వాతావరణాన్ని ఏర్పరచడం సాధ్యమేనా? అని ఇప్పుడు ఆశ్చర్యపోవాల్సిందే! నిరంతరం ఉత్సాహం, ఆనందం మన ఇంట్లో పరవళ్ళు తొక్కుతూ వుండేది.


అమ్మ, నాన్నగార్లు ఏ విషయం మీదైనా వాదించుకోవడం కూడా నేను చూడలేదు. వారిద్దరి మధ్య వాదన కాదు కదా, చర్చ కాదు కదా, కనీసం అభిప్రాయభేదాన్ని కూడా మేమెప్పుడూ చూడలేదు. ఇద్దరూ వారి వారి బాధ్యతలను అత్యంత సామరస్యంతో నెరవేర్చేవారు. ఇంటికి వచ్చినవారు రకరకాల మనస్తత్వాలతోను, స్వభావాలతోను వచ్చి తమకు, సాటివారికి ఆ పుణ్యదంపతులకు ఎన్నో సమస్యలు తెచ్చిపెట్టేవారు. వారు అత్యంత ప్రశాంతంగా, చాకచక్యంగా, ప్రేమగా వారు ఎలా ఆలోచించుకుంటే ఆ సమస్య, అభిప్రాయ భేదము తొలగి సామరస్యత కుదురుతుందో చెప్పి, వాళ్లు వారిని సాయి సేవకు సామరస్యంతో ఉపక్రమించేలా చేసేవారు.

పిల్లలమైన మాకు కలిగిన ప్రతి చిన్న కోరిక, సరదా తీర్చేందుకు ప్రయత్నించేవారు. వారు తీర్చలేని కోరికలను, మేము అడగనూ లేదు. వారు మేము అడిగినవి తీర్చకుండానూ లేరు. ఇంట్లో నిరంతరం జరిగే ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పాల్గొనమని మమ్మల్ని ఎన్నడు బలవంతపెట్టి ఎరుగరు. అది ఎందుకు మంచిదో చెప్పి మా స్వేచ్ఛకు మమ్మల్ని వారు వదిలి వేసేవారు. మేము అడిగే ప్రతి ప్రశ్నకు ఓర్పుగా సమాధానం చెబుతూ, మా మనసులలో బాబాను సేవించడం, స్మరించడం ఎందుకు



మంచిదో మాకు అర్థమయ్యే దాకా వివరించేవారు. కానీ మేము హారతి గానీ, పూజ గాని చేయాలని మాకు మేము సంసిద్ధులమయినప్పుడు ఆ పూజ లేక హారతి అశ్రద్ధగా చేస్తే ఒప్పుకునేవారు కాదు. శ్రద్ధగా చేయడంలోనే ఫలితం వున్నదని, అదే బాబాకు సంతోషాన్ని కలిగిస్తుందని చెప్పేవారు.

నాన్నగారు, నేను చిన్నప్పుడు కలిసి పళ్ళు తోముకునేవారం. ఆయన నాకు, తమ్ముడికి స్నానం చేయించేవారు. తరువాత ఆయన స్నానం చేసేవారు. ఆ తరువాత మేము కలిసి భోజనం చేసేవారం. అప్పుడప్పుడు మాకు ముద్దలు కలిపి పెడుతూ, బాబా గురించి మాట్లాడటం గానీ, తమ్ముడిని ఆడిస్తూ భోజనం పెట్టడంగాని చేసేవారు. తరువాత తరువాత ఒక్కొక్కసారి దూరదర్శన్ లో ప్రసారమయ్యే U.G.C కార్యక్రమాలు అందరం కలిసిచూస్తూ భోజనం చేసేవారము. నాన్నగారు నాతో క్యారం బోర్డు, చైనీస్ చెక్కర్, పులి–మేక ఆడేవారు. ఆయనతో కలిసి ఉదయం ఒకొక్కసారి వాకింగ్ కి వెళ్ళేదాన్ని. కొన్ని రోజులు కలిసి ఆసనాలు, ప్రాణాయామం కూడా చేసేవారము. ఆయనే మాకు అవి నేర్పారు కూడా! నేను కూచిపూడి నృత్యం నేర్చుకునే దానిని. నేను ఇచ్చే ప్రదర్శనలకు ఏమాత్రం వీలున్నా తప్పకుండా వచ్చేవారు. ఒంగోలులో చిత్రలేఖనం, వ్యాసరచన, వక్తృత్వం, పాటలు, నృత్యం, ఆటలు – ఏ పోటీలు జరిగినా తప్పకుండా మేమిద్దరము పాల్గొనేవారము. భగవద్గీత శ్లోకాలు పోటీలకు, విచిత్ర వేషధారణ పోటీలకు కూడా పంపేవారు. హిందీ పరీక్షలకు, సంస్కృత పరీక్షలకు కూడా మేము ఇద్దరమూ వెళ్ళాము. అన్నింటికీ ఆయనే శ్రద్ధ వహించి మమ్మల్ని తయారుచేసి



పంపించేవారు. ఎక్కువసార్లు మేమిద్దరము ఏదో ఒక ప్రైజ్ గెలిచేవారం. తప్పకుండా స్కూల్లో ఫస్ట్ రావాలి, పోటీలలో మీరే గెలవాలి, అని ఆయన ఎప్పుడూ చెప్పలేదు. తప్పకుండా పాల్గొనండి అని మాత్రమే అనేవారు.

ద్వారక తో ఎక్కువగా క్రికెట్, బ్యాడ్–మెన్–టెన్ ఆడేవారు. బాణాలు వేయడం నేర్పేవారు. ఇక అమ్మ ఇచ్చే ప్రోత్సాహం, అమ్మ ఉత్సాహం, సరదాకు మరేదీ సాటిరాదు. రంగురంగుల కాగితాలతో, కర్రలతో, పుల్లలతో, ద్వారకకు రకరకాల బాణాలు, కిరీటాలు, అమ్ములపొదులు తయారు చేసేవారు. ఇక ద్వారక దగ్గర ఉన్నన్ని బ్యాట్లు, బాల్స్ ఇంకెవరి దగ్గర ఉండేవి కావు. ఎన్నైనా కొనిచ్చే వారు. “మొన్నే కొన్నాను కదా, అప్పుడే మళ్లీ కావాలా?” అని వారు ఎప్పుడూ అనలేదు. కానీ వాడి బ్యాట్ లతో, విల్లు–బాణాలతో, బొంగరాలతో, తుపాకీలతో, చిన్నా పెద్దా అందరూ ఆడుకునేవారు. ఇంటికి వచ్చిన పిల్లలు పాడు చేసేవారు కూడా! అయినా మేమేమీ అనుకునేవారం కాదు. ‘పాడైపోతే కొత్తది కొనుక్కోవచ్చు’ అనే ధీమా మాకెప్పుడూ వుండేది. రకరకాల చిరుతిండ్లు, పానీయాలు, అమ్మ మా కోసం ఎంతో రుచిగా తయారు చేసేవారు, చేయించేవారు. ఇంటికి వచ్చిన పిల్లల సరదాలు కూడా తీర్చేవారు అమ్మ. వారికి నచ్చిన పిండివంటలు చేయించడం, వారితో ఆడటం ఆమెకెంతో సరదా! ఆమెతో మేము చెస్, చైనీస్–చక్కర్, అష్టాచమ్మా, క్యారంబోర్డు, బిజినెస్–ఇలా అమ్మగారితో మేమంతా ఆడని ఆట లేదు. ఇంటికి వచ్చిన ఆడపిల్లలకు పూల జడలు, ఫోటోలు, గోరింటాకు, వంటలు, వడ్డనలు–ఇలా అన్నీ చేయడం, నేర్పడం చేసేవారు అమ్మ.

అమ్మకు బుక్ బైండింగ్ దగ్గర నుంచి పొలం పనుల దాకా, వంటలు, కుట్లు–అల్లికలు, టైలరింగ్, ఇల్లు కట్టడం, తోటపని... అన్నీ వచ్చు. ఇక శ్లోకాలు, పద్యాలు, పాటలు, పాడటం, రాయడం వచ్చు. అందుకని అందరికీ

ఏది అవసరమైతే అది చేసేవారు అమ్మ.

మేము చేసే ప్రతి చిన్న పెద్ద పనులలో, అమ్మ చేసే పని ఎక్కువ, మేము చేసేది తక్కువ వుండేది. ఉదాహరణకు నేను స్కూలుకు వెళుతుంటే బ్యాగు సర్దడం, పాకెట్ మనీ, రబ్బర్ బ్యాండ్ లు, పెన్ను, పెన్సిల్ మొదలైనవి అన్నీ అమ్మే పట్టించుకునేవారు. నాకు చాలా పెద్ద జడ వుండేది. దానిని ఆమె రకరకాలుగా వేసేవారు. మా పుస్తకాలకే కాక ఎప్పుడైనా మా స్నేహితుల పుస్తకాలు, ఏ కారణంగానైనా మా దగ్గరకు వస్తే అందమైన ప్రకృతి బొమ్మలు ఉన్న కాగితాలతో బైండింగ్ చేసి అట్టలు వేసి యిచ్చేవారు. అలాగే మా స్నేహితులకు కూడా రకరకాల చిరుతిండ్లు స్కూలుకు పంపేవారు.

ఇంతా చేస్తే, ఆమెకు ఆరోగ్యం అస్సలు బాగుండేది కాదు. ఆమె చాలా కాలం నుంచి నడవలేరు కూడా! అయినా తన అనారోగ్యం ప్రభావం దైనందిన జీవితం మీద గాని, బాబా సేవ మీద గాని, ఇంటి వాతావరణం మీద గాని, మా సరదా జీవితం మీద గానీ, అస్సలు పడలేదు. అసలు ఆమెకు అంతటి తీవ్రమైన శారీరక బాధలు ఉన్నాయని కానీ, ఆమె అనారోగ్యం గురించి గానీ మాకు గుర్తు కూడా వుండేది కాదు. అంత ఉత్సాహంగా వుంటారు అమ్మ.

ఇక మాస్టరుగారు హాస్యప్రియులు. అమ్మగారూ అంతే! ఎప్పుడూ సరదాగా వుండేవారు. చలోక్తులకు సామెతలకు తక్కువ లేదు. అందుకే ఇంట్లోని చిన్నలకు, పెద్దలకు, ఇంటికి వచ్చిన వారికి ఎంతో ఉల్లాసంగా ఉత్సాహంగా వుండేది. ప్రతి సన్నివేశంలోనూ, సంఘటనలోనూ, సరదాలోనూ వెనకాలే నేపథ్య సంగీతంలో సాయినాథుని ధ్యాస అనుసంధానమవుతూ వుండేది. ఉదా. ద్వారక బాణం వేసిన ప్రతిసారి, బాబాకు నమస్కరించుకుని వేసేవాడు. అమ్మ చెస్ ఆడిన ప్రతిసారి, ప్రతి అడుగులోనూ బాబా స్మరణతో వేసేవారు. పూలజడ వేసేటప్పుడు, జడ అల్లినప్పుడు, పక్క పిన్నులు పెట్టేటప్పుడు, పూలు ముడిచినప్పుడు బాబా స్మరణతోనే చేసేవారు. ఇలా ఎల్లప్పుడూ గుర్తు పెట్టుకునే అలవాటు ఒక సంస్కృతిలా మలిచారు అమ్మ.

ఇక ఇంటికి వచ్చిన ప్రతివారిని, ఇంట్లోని వారిని, చక్కగా ఆదరించి వారికి ఉపయోగపడటమే అమ్మ నాన్నగార్ల ఉద్దేశం. తమకు పరిచయం ఉన్న ప్రతివారి మానసిక, శారీరక, ఆర్థిక, ఆధ్యాత్మిక అవసరాలను గుర్తించి స్వాంతన, సహాయము, సహకారము సాధ్యమైనంత అందించి, వారిని సాయి మార్గంలో పయనింప చేయడమే వారి ఉద్దేశం. కనుక నాన్నగారి దగ్గరకు వచ్చే ఆర్తులకు, అర్థార్థులకు, జిజ్ఞాసువులకు, ముముక్షువులకు తగిన మార్గం చూపే వారాయన. ఇక అమ్మగారు వారందరినీ ఆదరించి పేరుపేరునా వారికి ఇష్టమైన వంటకాలను సమకూరుస్తూ, వారి అవసరాలను గుర్తిస్తూ వాటిని సమకూర్చేవారు. ఎవరికైనా అనారోగ్యంగా వుంటే, వారిపై ప్రత్యేక శ్రద్ధ వహించి తగిన ఆహారము, వైద్యము, విశ్రాంతి ఉండేలా చూసుకునేవారు. ఆ పుణ్యదంపతుల ప్రేమ, ఆదరణను ఎవరూ, ఏనాటికీ మర్చిపోలేరు. పిల్లలమైన మేము కూడా వారందరితో ఎంతో ప్రేమగా, ఆప్యాయంగా, ఆదరణగా ఉండేవారం. నేను ఎవ్వరు ఊరికెళ్ళినా చాలా బాధపడే దానిని. ఎంతమందైనా మాతోనే ఉండాలని తిరిగి వెళ్ళిపోకూడదని నా కనిపించేది.

మా బంధువులలో ఎవరైనా వస్తే వారిని ఆదరించి, వారితో సాధ్యమైనంత సమయం గడిపేవారు అమ్మ, నాన్నగారు. అమ్మ తప్పకుండా వారికి బట్టలు పెట్టి పంపించేవారు. మాకు మాత్రం వారికి, మా ఇంటికి వచ్చి వెళ్లే గురుబంధువులకి మధ్య తేడా తెలిసేది కాదు. ఇప్పటికీ తెలియదు.

కుటుంబ పెద్దలతో (బామ్మ, తాత గార్లతో) అత్యంత వినమ్రతతో, గౌరవంతో మెలిగేవారు అమ్మ, నాన్నగారు. వారిపట్ల పూజ్యభావంతో ఉంటూ, వారికి సేవచేస్తూ, వారికి కావలసిన భోజనాన్ని, ఇతర అవసరాలను తీరుస్తూ, భక్తి వినమ్రతలతో వుండేవారు. వారు కూడా అమ్మ నాన్నగార్ల మీదగాని, మా మీద గాని తమ పెద్దరికాన్ని ప్రదర్శించే వారు కాదు. ఎంతో విశాల హృదయంతో సంకుచిత తత్వం లేని పరిణతి కలిగిన పెద్దలు వారు. వారు మాతోనే గాక, మన ఇంటికి వచ్చే భక్తులతోను ఇంట్లో వున్న వారితోనూ, చివరకు పనివారితో కూడా ఒకే ప్రేమతో బేధభావం లేక మెలిగేవారు. అమ్మ నాన్నగార్ల జీవితం వారి ఇష్టప్రకారం నడుపుకోవడానికి పూర్తి స్వేచ్ఛనిచ్చే పరిణతి వారిలో కనిపించేది. నేటి కుటుంబ పెద్దలకు వారికి ఎంత తేడా!

మన ఇంటికి వచ్చే వారి వస్త్రధారణ, ఆర్థిక స్థితిగతులు, వారి ఉద్యోగాలు, హోదాలు, ఆస్తిపాస్తులు, కులమతాలు మొదలైన వాటి గురించి అసలు పట్టించుకునే వారు కాదు. అవి ఎప్పుడూ సంభాషణలోకి వచ్చేవి కావు. జీతాలు, హోదాలు, కార్లు, ఆభరణాలు మొదలైనవాటి గురించి మన ఇంట్లో అమ్మ నాన్నగార్లు కనీసం ప్రస్తావించడం కూడా మేము

ఎప్పుడూ వినలేదు. అవి అప్రస్తుతములు, అప్రధానములు నిరుపయోగములైనవని వారి దృఢ విశ్వాసం. వాటికి నిత్యజీవితంలో ప్రాధాన్యత లేదు – సాయికి, ఆయన సేవకు తప్ప. ఎదురుకుండా గుడిసెలలో వుండే పిల్లలకు, గురుబంధువుల పిల్లలకు మధ్య తేడా మేమెప్పుడూ చూడలేదు. అందరితో సమానంగా ఆడుకునే వారము.

పిల్లలమైన మాకు కావలసినవి సంతృప్తిగా సంపూర్ణంగా సమకూరుస్తూనే అందులోనుంచే వివేకవంతమైన ఆలోచనను పెంపొందింప చేసేవారు అమ్మ, నాన్నగారు. ఉదాహరణకు రుచికరమైన వంటకాలు పెడుతూనే ఆరోగ్యం కోసం భోజనం చేయాలని రుచికోసం కాదని చెప్పేవారు. “ఒక్క మూడంగుళాల నాలుకను సంతృప్తిపరచడానికి ఎన్నిపాట్లు? చేదుగా ఉన్నది ఆరోగ్యకరమైనదైతే మూడంగుళాల నాలుక గురించి ఆలోచించకూడదు, అదిచ్చే ఆరోగ్యాన్ని గురించి ఆలోచించాలి. మనసు చెప్పినట్లు మనం వినకూడదు, మనం చెప్పినట్లు మనసు వినాలి” అని చెప్పేవారు. అలాగే మనకున్న డబ్బును గానీ, హోదాను గాని, అందాన్ని గాని, అలంకరణను గాని చూసి ఎవరైనా గౌరవించినా, స్నేహం చేసినా అది వారు మనలను ప్రేమించడము, గౌరవించడమూ కాదని, మనకంటే మనకున్న హంగులకు వారు ఎక్కువ ప్రాధాన్యత నిస్తున్నారని అర్థమని చెప్పేవారు. కనుక మనం వాటికి విలువ నివ్వకూడదని, వాటిని బట్టి మనం ఎవ్వరికీ విలువనివ్వకూడదనీ, అవతలి వారి గుణాలను బట్టి వారికి విలువ నివ్వాలని చెప్పేవారు. అలాగే నిజమైన అందం మన ప్రవర్తన లోనూ మానసిక, శారీరక ఆరోగ్యం మీద ఆధారపడి వుంటుందని, అంతేగాని పైపై అలంకరణలో కాదనీ చెప్పేవారు. ఒకవంక పూల జడలు వేస్తూనే, గోరింటాకు పెడుతూనే, ఈ విషయాలను చర్చించడం వల్ల మా సరదా, మోజూ తీరేది. వివేకవంతమైన ఆలోచనా చేతనయ్యేది.

ఇక సినిమాలు, నవలలు, అనవసర కాలక్షేపాల గురించి, సాంఘిక దురాచారాల గురించి, మూఢ సాంప్రదాయాల గురించి, అన్నింటి గురించి నిరంతరం చర్చలు జరుగుతూ వుండేవి. అయినా మా సరదాలకు లోటేలేదు. అందరం కలసి సముద్రస్నానాలకు, ఎన్నో యాత్రలకు కూడా వెళ్ళాము. ఎన్నో ఆధ్యాత్మిక గ్రంథాలు చదవడమూ, రాత్రింబవళ్ళు చర్చలు చేయడమూ జరుగుతూనే వుండేది.

నిజానికి మాస్టరుగారు, అమ్మగార్ల వివాహమైనప్పటి నుంచి అమ్మగారికి ఆరోగ్యం బాగాలేదు. తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ వుండేవారు. ఇంట్లో ఆర్థిక ఇబ్బందులు ఉండేవి. ఇక ఆ పుణ్యదంపతులు ఎదుర్కొంటున్న సమస్యలకు అంతేలేదు. మాస్టరుగారికి ఉద్యోగపరమైన ఇబ్బందులు, ఆర్థిక ఇబ్బందులు, సామాజిక ఇబ్బందులు, భక్తుల రకరకాల మనస్తత్వాల వల్ల ఇబ్బందులు ఎన్నెన్నో వుండేవి. కులాంతర మతాంతర వివాహాలను చేయడం వల్ల ఆయన ఎంతోమంది విమర్శలకు గురయ్యారు. నాస్తిక, హేతువాదులతో ఆయన వాదించడంవల్ల వారి నుంచి వ్యతిరేకతకు గురయ్యారు. నకిలీ ఆధ్యాత్మికతను బట్టబయలు చెయ్యడంవల్ల దొంగ గురువులు, ఆధ్యాత్మిక వంచకుల ఆగ్రహానికి గురయ్యారు. కుటిల రాజకీయాలను అడ్డుకోవడంతో కొందరు రాజకీయ నాయకుల వల్ల ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఛాందసమైన సాంప్రదాయాన్ని, మతదృష్టిని విమర్శించడం వల్ల ఆయన కుల పెద్దల నుంచి, మత పెద్దల నుంచి తీవ్రమైన వ్యతిరేకతను ఎదుర్కొన్నారు. అంతేకాక ఆయన అవ్యాజమైన ప్రేమను తమ స్వార్థానికి వాడుకొని ఆయననే వంచించి కష్టాలకు గురి చేసిన వారెందరో! ఆయన నిరాడంబరత వల్ల ఆయనకు సరైన సౌకర్యాలు అవసరమే లేదని భావించిన భక్తులందరో! రకరకాల మనస్తత్వాలు గల ఇంటిలో వుండే, ఇంటికి వచ్చే భక్తుల వల్ల నిరంతరం ఆయనకు ఎన్నెన్నో ఇబ్బందులు కూడా కలిగేవి. అయినా ఇవేవీ ఆ పుణ్యదంపతులను, ఆ ఇంటి ఆహ్లాదకరమైన పవిత్ర దీక్షా వాతావరణాన్ని చలింపజేయలేకపోయాయి. అసలన్ని ఇబ్బందులను వారు ఎదుర్కొంటున్నారని వారికి గాని, మాకు గాని అసలు స్పృహలో లేనట్లే వుండేది. బాబా పట్ల వారికి ఎంతటి విశ్వాసమో!

అంతేకాదు, మన ఇల్లు చాలా చిన్నదే ఎప్పుడూ. అయినా దాని హృదయం చాలా విశాలం. మన ఇంటి వాతావరణం ఆహ్లాదకరం, ప్రోత్సాహకరం పవిత్రం, దీక్షామయం. అందుకే మన ఇంటికి వచ్చిన వారందరికీ తిరిగి వెళ్లాలనిపించేది కాదు. మాకు వారిని పంపాలనిపించేది కాదు. మళ్ళీ ఎప్పుడు కలుసుకుంటామా అని మేము, వారు ఎదురుచూస్తూ వుండేవారం అదే నాటికీ, నేటికీ కొనసాగుతోంది, కొనసాగుతూనే వుంటుంది.

# మాతృదేవి స్మృతులు

*శ్రీమతి సాయిరామలక్ష్మి; శ్రీమతి లక్ష్మీ శ్రీదేవి*

పూజ్యశ్రీ అలివేలుమంగమ్మతల్లి లీలావైభవాన్ని అమెరికాలోని అట్లాంటాకి చెందిన శ్రీమతి సాయిరామలక్ష్మిగారు ఈవిధంగా తెలియచేస్తున్నారు...

మొట్టమొదట మా నాన్నగారి స్నేహితుని భార్య నాకు పూజ్యశ్రీ మాస్టరుగారి గురించి చెప్పారు. ఆమె దగ్గర చాలా ఆధ్యాత్మిక గ్రంథాలుండేవి. ఆమె 'శ్రీ సాయి మాస్టర్ ప్రవచనాలు' గ్రంథం ఇచ్చారు. అది చదివాక అందులోని విషయాలను వివరించిన తీరు నా మనసుపై చెరగని ముద్ర వేసింది. 'నా జీవితంలో ఏమున్నా లేకపోయినా మాస్టరుగారు, వారి గ్రంథాలూ తోడుంటే చాలు!' అని ప్రార్థన చేసుకున్నాను.

2005లో నాకు వివాహమైన వెంటనే మావారు అమెరికా వెళ్లిపోయారు. ఎన్నిసార్లు ప్రయత్నించినా నాకు వీసా దొరకలేదు. చివరికి 2006లో పూజ్యశ్రీ అమ్మగారికి ఈ విషయం ఫోన్ ద్వారా నాకు వీసా వచ్చేలా అనుగ్రహించమని ప్రార్థించాను. పూజ్యశ్రీ అమ్మగారు, “అలాగే!” అన్నారు. నాకేమీ పారాయణ చెప్పలేదు. పూజ్యశ్రీ అమ్మగారు చెప్పినట్లే వీసా వచ్చి జులైలో అమెరికా వెళ్లాను. నేను అమెరికా వెళ్ళాక సాయిమాస్టర్ ఫోరమ్స్ లో చేరాను. అందులో ద్వారాకబాబుగారి సాంగత్యం దొరికింది. కానీ నాకు పూజ్యశ్రీ అమ్మగారిని సశరీరంగా దర్శించే భాగ్యం కలుగలేదు.

కొన్ని సంవత్సరాల తరవాత నాకు గర్భాశయానికి సంబంధించిన సమస్యలు వచ్చాయి. అక్కడ చికిత్స చేయించుకున్నా నా సమస్య తీరలేదు. ఇండియాకి వచ్చి హైదరాబాదులోని వైద్యులను సంప్రదిస్తే శస్త్రచికిత్స చేయించుకోవలసి వస్తుందని, ఎక్కువ సమయం పట్టవచ్చని చెప్పారు. నేను బాబాకు, పూజ్యశ్రీ అమ్మగారికి, పూజ్యశ్రీ మాస్టరుగారికి శస్త్రచికిత్స సరిగ్గా జరిగేటట్లు అనుగ్రహించమని, నాకు తోడుగా వుండమని నమస్కారము చేసుకున్నాను. శస్త్రచికిత్స చేసే గదిలో నాకు ఎడమవైపు వైద్యులు నిలబడి చికిత్స చేస్తుంటే, నా కుడివైపున ఆ సద్గురుమూర్తులు నిలుచుని వున్నట్లు చాలాసేపు అనుభవమైంది. వారి దయవల్ల శస్త్రచికిత్స విజయవంతమై నా ఆరోగ్యం చక్కబడింది.

వారి గ్రంథాలు పారాయణ చేస్తున్నా, లైవ్ లో సత్సంగాలు వింటున్నా, 'నా ఆలోచనలలో, ప్రవర్తనలలో మహాత్ములకు నచ్చే విధముగా మార్పురావటం లేదే?' అని చాలా బాధగా వుంటోంది. అప్పుడు ఒకరోజు పూజ్యశ్రీ అమ్మగారికి నమస్కారము చేసుకుని,”అమ్మా! నా వైఖరిలో మార్పు రావాలంటే నేను ఏ గ్రంథము చదువుకోవాలి?” అని అడిగాను. అదేరోజు పూజ్యశ్రీ అమ్మగారు స్వప్నదర్శనమిచ్చి,”ఆధ్యాత్మిక జాగృతి గ్రంథం చదువుకో!” అని చెప్పారు. నాకు చాలా ఆనందం కలిగింది. ఆ రోజునుంచే ఆ గ్రంథాన్ని చదవడం మొదలుపెట్టాను. ముఖ్యంగా ఆ గ్రంథంలో – చాలా సంఘటనల్లో ఎలా ఆలోచించి అవగాహన చేసుకోవాలో పూజ్యశ్రీ అమ్మగారు విడమరచి చెప్పారు. అందరికీ ఉపయోగపడే అనేక విషయాలు అందులో వున్నాయి.

ఒకరోజు మా ఇంట్లో ఒక విషయం మీద నాకూ మావారికి అభిప్రాయభేదం వచ్చింది. చివరికి ఆయనదే తప్పని నాకు అనిపించి, ఈ సంగతి పూజ్యశ్రీ అమ్మగారితో చెప్పుకుంటూ, “అమ్మా, ఈరోజు ఇలా జరిగింది కదా, మీరే చెప్పండి ఎవరిది తప్పో!” అని అడిగాను. ఆరోజు 'ఆధ్యాత్మిక జాగృతి' గ్రంథం చదువుతుంటే అందులో ఒక సంఘటనలో



పూజ్యశ్రీ అమ్మగారు ఒకరితో, "మన వైపునుంచేనా? వాళ్ళ వైపు ఆలోచించవద్దా?" అని అడిగారు. అప్పుడు ఆ వాక్యం నాకే చెప్తున్నట్లు అనిపించింది. నేను పునరాలోచన చేసుకొంటే, తప్పు నాదేనని, మావారిది కాదని అర్థమైంది.

ఇలా ప్రతిక్షణం నా వెంటవుండి పరిస్థితులను, మనఃస్థితులను సరిచేస్తూ 'నా సమాధి అనంతరం నేను అప్రమత్తుడనే, నా సమాధినుంచే నేను సమాధానం చెప్తాను' అన్న బాబా సూక్తులను నిజం చేస్తూ, నిత్యసత్యులై వెలుగొందుతున్న మాతృదేవి పూజ్యశ్రీ అలివేలు మంగమ్మ తల్లి అనుగ్రహం లభించడం జన్మజన్మల సుకృతంగా భావిస్తూ వారి పాదపద్మములకు అంజలి ఘటించి నమస్కరిస్తున్నాను.

పూజ్యశ్రీ అలివేలుమంగమ్మతల్లి లీలావైభవాన్ని విజయవాడకు చెందిన శ్రీమతి లక్ష్మీ శ్రీదేవిగారు ఈవిధంగా తెలియచేస్తున్నారు...

నాకు 2018లో విజయవాడ వాస్తవ్యులైన శ్రీ సాయిరాంగారితో వివాహమైంది. పెళ్లి కుదిరాక పెళ్లి జరిగేలోపు ఆయన నన్ను శ్రీ గురుచరిత్ర, శ్రీ సాయిలీలామృతము ఒకసారి పారాయణ చేయమన్నారు. అప్పుడే మొట్టమొదటిసారి ఆ గ్రంథాలు చదవాను. అప్పటికి నాకు బాబా గురించి తప్ప పూజ్యశ్రీ మాస్టరుగారి గురించి కానీ, పూజ్యశ్రీ అమ్మగారి గురించి కానీ ఏమీ తెలియదు.

పెళ్లయ్యాక శ్రీసాయిలీలామృతము సప్త సప్తాహాలు పారాయణ చేద్దామని అనుకున్నాను. కానీ మొదలుపెట్టలేదు. ఈలోపు గర్భవతినయ్యాను. నాలుగవ నెలలో ఒకసారి ఒక స్వప్నం వచ్చింది. ఆ స్వప్నంలో నేను ఒంగోలులో పూజ్యశ్రీ మాస్టరుగారి బృందావనానికి వెళ్లాను. అక్కడ పూజ్యశ్రీ అమ్మగారు పూజ్యశ్రీ మాస్టరుగారి సమాధికి పూలమాల సమర్పించి, ఒక పక్కకి నిలబడి వున్నారు. నేను పూజ్యశ్రీ అమ్మగారికి నమస్కారము చేసుకున్నాను. అప్పుడు పూజ్యశ్రీ అమ్మగారు, "నేనెందుకు వచ్చానో తెలుసా? పూజ్యశ్రీ మాస్టరుగారు పంపించారు. నువ్వేదో సప్త సప్తాహాలు చేస్తానన్నావట కదా! అది చేసెయ్యమని చెప్పమన్నారు" అన్నారు! నాకు చాలా సంతోషం కలిగింది.

ఈవిషయం పూజ్యశ్రీ మాస్టరుగారే చెప్పవచ్చు. నాకు పూజ్యశ్రీ అమ్మగారి దర్శనభాగ్యం కలిగించి, నేను మర్చిపోయిన విషయం గుర్తుచేశారు! నాకు అప్పుడు నాలుగవ నెల. వెంటనే సప్త సప్తసప్తాహాలు మొదలుపెట్టి, నెలలు నిండేసరికి శ్రీగురుచరిత్ర, శ్రీసాయిలీలామృతము కూడా పూర్తిచేశాను. తరువాత నాకు బాబు పుట్టాడు. అలా మొట్టమొదట పూజ్యశ్రీ అమ్మగారు తమ దర్శనభాగ్యాన్ని ప్రసాదించారు.

మావారు ఒకసారి శిరిడి వెళ్ళినప్పుడు, గురుస్థానానికి ప్రదక్షిణ చేస్తూవుంటే గురు పుత్రులు శ్రీ ద్వారకబాబు దంపతులు కలిశారు. మావారు వారికి నమస్కారము చేసుకోగానే, బాబుగారు 'భగవాన్ శ్రీ భరద్వాజ' గ్రంథం సంచీలో నుంచి తీసి ఇచ్చి పారాయణ చేసుకొమ్మన్నారట. ఇంటికి వచ్చాక మావారు పారాయణ చేసుకున్నారు. పారాయణ పూర్తి అవ్వగానే పూజ్యశ్రీ అమ్మగారు స్వప్న దర్శనమిచ్చి, మావారి నుదిటిపై తమ బొటనవేలుతో గుండ్రంగా తిప్పి, "అంతా బాగుంటుంది!" అని చెప్పారు.

మేమెప్పుడూ పూజ్యశ్రీ అమ్మగారి దర్శనము చేసుకోలేదు. అయినా మమ్మల్ని ఎంతగా కనిపెట్టుకుని ఉన్నారో! నాకు చాలా సందర్భాలలో పూజ్యశ్రీ అమ్మగారు ఎన్నెన్నో సూచనలు చేసి ముందుకు నడిపించారు. ఆ తల్లితో నా అనుబంధం ఏనాటిదో!

జై సాయి మాస్టర్!!

# "బాబా నా పసుపు కుంకుమలు నిలిపారు"

శ్రీమతి బి.వి.మణి

నవంబరు 28, 1984. తెల్లవారుఝామున 3గంటల ప్రాంతంలో మావారు (శ్రీ బి. ఉమామహేశ్వరరావు గారు) నన్ను నిద్రలేపి, శ్రీ శిరిడి సాయిబాబా కలలో కన్పించి, "రేపు ప్రాణాపాయం కలిగేటంతటి ప్రమాదం జరుగుతుంది, జాగ్రత్త! దగ్గర బంధువులను పిలిపించుకో. నీకు నేనున్నాను, భయం లేదులే!" అన్నారని చెప్పారు. మా చెల్లెళ్ళకు ఫోన్ చేసాను.

మా చెల్లెళ్ళ వాళ్ళ అబ్బాయిలు ఆ రాత్రి యిక్కడనే తోడుగా పడుకొన్నారు. మరునాడు అనగా 29వ తేదీ గురువారం, మావారు ఉదయం పూజలో కూర్చున్నారు. ఒక గంట గడచినది. ఆయన ధ్యానంలో 1, 2 గంటలుండటం పరిపాటే గనుక మేము చూడలేదు. మా మనుమరాలు ఈయన బాబా పాదాలవద్ద ఒరిగి పోయి వుండటం చూచి కంగారుగా మమ్ములను పిలిచింది. ఆయనను మంచముమీద పడుకోబెట్టి డాక్టరును పిలిపించాము. వారు చూచి పరిస్థితి చాలా ప్రమాదకరంగా వుందని, వెంటనే హాస్పిటల్ లో చేర్చమని చెప్పారు. డాక్టరు వెళ్ళాక అసంపూర్తిగా వుండిన పూజ పూర్తిచేసి బాబాకు హారతి యిచ్చి రోగిదగ్గరకు వెళ్ళి చూస్తే, ఆయన ఊపిరి పీల్చడంలేదు; గుండె, నాడి కొట్టుకొనడంలేదు!! నాకు భయంవేసి "బాబా, బాబా" అని గట్టిగా 'బాబా'ను పిలిచేను. ఆగిపోయిన గడియారం మళ్ళీ కదిలినట్లు శ్రీ బాబా దయవలన మావారి గుండెలో చలనం వచ్చి మళ్ళీ ఊపిరి పీల్చుకున్నారు. అయినా ఆయనకు స్పృహరాలేదు. హాస్పిటల్ లో చేర్చగా అక్కడ వెంటనే E.C.G., రక్త పరీక్షలు మొదలైనవి చేసి పరిస్థితి బాగులేదన్నారు. ఊపిరితిత్తులలో చేరిన కఫాన్ని తీసేసారు. B.P. దిగి పోయిందన్నారు. రక్తంలో షుగర్ తగ్గి అలా జరిగిందన్నారు. ఒక గంట ఆలస్యమయితే ప్రాణాపాయము జరిగేదని డాక్టర్లు చెప్పినారు. మావారికి డయాబెటీస్ గాని, బ్లడ్ ప్రషరులాంటిది గాని లేదు. మరి అలా ఎందుకు జరిగిందో తెలియదు.

వారికి ఒకప్పుడు గుండెజబ్బు వుండేది. అయోల్టిక్ వాల్వు ట్రబుల్ వుండేది. కాని శ్రీ సాయి కరుణాకటాక్షము వలన, నవంబరు 1983లో చిలుకు ఏకాదశి రోజు బాబా ఫొటోలో నుండి ఒక వెలుగు రేఖ ఆయన గుండెమీద ప్రసారమై ఆ జబ్బు పూర్తిగా నయమైనది. తర్వాత గుండె స్పెషలిస్టులు చూచి ఆశ్చర్యపడసాగారు. ఇప్పుడు పోయిన ప్రాణమే తిరిగి వచ్చినది. శ్రీ బాబా ముందు హెచ్చరించబట్టి మావాళ్ళను సహాయంగా పిలిపించగలిగాను. వాళ్ళు వెంటనే డాక్టర్ని తీసుకొనివచ్చి నర్సింగుహోములో చేర్చుటకు సహాయపడినారు. అదే నేను వంటరిగా వుండివుంటే అంత తొందరగా ఆయనకు ట్రీట్–మెంటు జరిగివుండేదికాదు.

మావారికి స్వప్నములో బాబా కనుపించిన రోజు రాత్రి మా బంధువుల అబ్బాయికి మావారు చనిపోయినట్లు కల వచ్చిందట. అతని తండ్రి పోయినప్పుడుకూడా యిలాగే రాత్రి కలవస్తే మర్నాడు మధ్యాహ్నం హార్టుఎటాకుతో పోయారు. అందుకని భయపడి ఈయనను చూచుటకు మాయింటికి వచ్చి, అప్పటికే ఆయన హాస్పిటల్లో వున్నందున అక్కడకువచ్చి చూచి వెళ్ళినాడు. అతని కలకు, మావారికి వచ్చిన ఆపదకు

***మిగతా 29వ పేజీలో***


# ఆచార్యుని అద్భుత లీలలు

**శ్రీమతి లలిత, U.S.A.**

పూజ్యశ్రీ భరద్వాజ గురుదేవుల లీలావైభవాన్ని USలో ఆర్కాన్సాస్ లో వుంటున్న శ్రీమతి లలితగారు ఈ విధంగా తెలియచేస్తున్నారు—

నాకు పూజ్యశ్రీ మాస్టరుగారు ఒక గ్రంథం ద్వారా పరిచయమయ్యారు. దాదాపు ఇరవయ్యేళ్ళ క్రితం అమెరికానుంచి ఇండియా వెళ్ళినప్పుడు శిరిడీకి వెళ్లాము. నాకు పుస్తకాలు చదివే అలవాటు వుండేది. ఎక్కడకి వెళ్లినా పుస్తకాలు కొనుక్కుంటాను.

మా అత్తగారువాళ్ళు, మా అమ్మగారువాళ్ళూ అందరం కలిసి శిరిడీకి వెళ్ళాము. అప్పుడు మా పాప 'సృష్టి' కి రెండు సంవత్సరాలు. మావాళ్ళు, "బాగా ఎండగా వుంది. పాపను తీసుకుని మేము రూముకి వెళతాము, మీరిద్దరూ తరవాత రండి!" అని చెప్పారు. నేను, మావారూ ఆ ద్వారకామాయికి ఎదురుగా వున్న ద్వారకామాయి ఎంపోరియంలోకి వెళ్ళాము. నేను ఏ పుస్తకం కొన్నా ముందు ఆ పుస్తకాన్ని అటూ ఇటూ తిరగేసి, కొద్దిగా చదివి, బాగుందనుకుంటే తీసుకుంటాను. నాకు అప్పటికి పూజ్యశ్రీ భరద్వాజ మాస్టరుగారు తెలియదు. నేను ఒక పుస్తకం తీసి అందులో ఒక పేజీ తెరిచాను. అందులో సాధన గురించి చెప్తూ, దాన్ని సైకిల్ తొక్కడంతో పోలుస్తూ, 'పల్లం వచ్చినప్పుడు నాలుగు తొక్కులు ఎక్కువ తొక్కేస్తే ఎత్తువచ్చినప్పుడు ఎక్కువ కష్టపడనక్కరలేదు!' అంటూ, 'సత్వగుణం వున్నప్పుడు ధ్యానాదులు బాగా దీక్షగా చేసుకోవాలి' అన్న వాక్యాలు చదవగానే, నాకు ఒక్కసారిగా 'అబ్బా! ఎంత తర్కం(లాజిక్) వుంది ఈ ఉదాహరణలో!' అనుకుని, అప్పుడు ఈ పుస్తకం పేరేమిటి? ఎవరు వ్రాశారు? అని చూశాను. అది పూజ్యశ్రీ అమ్మగారు సంకలనం చేసిన 'శ్రీ సాయి మాస్టర్ ప్రవచనములు' గ్రంథం. అప్పుడు షాప్ కౌంటరులో బాగా పెద్దాయన కూర్చునివుంటే ఆయనతో, "తాతా! ఈయన వ్రాసిన పుస్తకాలెన్ని వుంటే అవన్నీ ఇవ్వండి" అనడిగాను. ఆయనే స్వయంగా అన్ని పుస్తకాలు తెచ్చి ఇచ్చారు. మొత్తం బిల్లు వేసి ఇమ్మన్నాను. బిల్లు వేసి ఆయన సంతకం చేసి ఇచ్చారు. ఇదంతా చేస్తున్నప్పుడు మా ఇద్దరికీ కొద్దిగా సంభాషణ జరిగింది. ఆయన, "'పాప బాగుందా?'" అనడిగారు. "బాగుంది!" అన్నాను యథాలాపంగా! "ఏదీ చూపించు?!" అన్నారు. "ఎండగా వుందని పాపను



మావాళ్ళు రూముకి తీసుకెళ్లారు" అని చెప్పి, "తాతా, మీకు నేను ఇంతకుముందే తెలుసా?" అడిగాను. "నువ్వు ఇక్కడి (శిరిడి) అమ్మాయివే కదా?!" అన్నారు. "కాదండీ, మాది ఆంధ్ర, వైజాగ్!" అని చెప్పాను. ఆయన నవ్వేసి, బిల్లు నా చేతిలో పెట్టారు. ఈ సంభాషణ అంతా



తెలుగు, హిందీ కలిపిన భాషలో జరిగింది. నేను బిల్లు చెల్లించాక కొద్దిగా డబ్బులు మిగిలివుంటే, “తాతా ఇవి నీకు దక్షిణగా ఇస్తున్నాను తీసుకో!” అని ఇచ్చేశాను. నన్ను ఆయన ఆశీర్వదించారు.

తరవాత రూముకి వస్తూ ఆలోచించుకున్నాను, ‘ఆయన పాపను చూపించమన్నారు, అసలు పాప వుందని నేను చెప్పలేదు కదా!’ అనుకున్నాను. సాయంత్రం పాపను ఆ తాతకు చూపించడానికి తీసుకెళ్ళాను. ఆ దుకాణంలో ఆయన లేరు. నేను కౌంటర్ లో వున్నాయనను ఆ తాత గురించి అడిగాను. అతను అలాంటివారెవ్వరూ లేరని చెప్పారు! అక్కడే పనిచేసే అబ్బాయిని సాటివారు ఉదయం ఎవరున్నారని మరాఠీలో అడిగారు. ఆ అబ్బాయి, నేనూ, ఇంకొక అబ్బాయి వున్నామని చెప్పాడు. నేను మళ్ళీ, “కాదండీ! ఉదయం ఒక పెద్దాయన వున్నారు. ఆయన బిల్లు కూడా వ్రాసిచ్చారు. కావాలంటే చూపిస్తాను” అన్నాను. మళ్ళీ అతను ఆ అబ్బాయిని అడిగితే ఆ అబ్బాయి అలా ఎవరూ లేరని చెప్పాడు!

సాయంత్రం సమయం అవ్వడం వల్ల షాప్ చాలా రద్దీగా వుంది. అతను కొంచెం విసుక్కున్నట్టు మాట్లాడాడు. మావారు నన్ను తీసుకువచ్చేశారు. తీరా ఇంటికి వచ్చాక ఆ బిల్లుని చూస్తే, ఆంగ్లంలో ‘సాయి’ అని సంతకం చేసివుంది! అది చూసి నేను ఆనందాశ్చర్యాలలో తేలిపోయాను. వారి ప్రియ శిష్యుడి గ్రంథాలన్నీ వారే దగ్గరుండి కొనిపించి నాకు భరద్వాజ మాస్టరుగారిని పరిచయం చేశారన్నమాట!! నాపై ఎంతటి దయ! ఆ బిల్లు నాదగ్గర భద్రంగా వుంది.

తిరిగి అమెరికా వచ్చాక ఆ గ్రంథాలన్నీ చదవడం మొదలుపెట్టాను. అయితే ఇదంతా జరగక ముందు కొన్నేళ్ల క్రితం నాకు ఒక స్వప్నం వచ్చింది. అందులో నేనూ, మా అమ్మ బాబా గుడికి వెళ్ళాము. అక్కడ ఒకాయన కుర్చీలో కూర్చుని వుంటే కొంతమంది ఆడవాళ్ళు ఆయనకు హారతిస్తున్నారు. నాకు కొంచెం నచ్చలేదు. పైన బాబాని పెట్టుకుని ఇక్కడ ఈయనకి హారతిస్తున్నారేమిటనిపించింది. పైగా ఆయనకు సమోసా నైవేద్యం పెడుతున్నారు. నాకది ఇంకా వింతగా అనిపించింది. ‘ఏ పులిహోరో, పరమాన్నమో పెట్టాలి కానీ ఇలా సమోసా ఏమిటి?’ అనిపించింది. నేను, మా అమ్మ గుడిలోనుంచి బయటకు వచ్చి రోడ్డు మీదకి వెళుతుంటే ఆయన కూడా బయటకు వచ్చి, “లలితా!” అని పెద్దగా పిలిచారు. నేను ఆగి ఆయన వైపు చూశాను.

ఆయన, “నేను ఒంగోలు వెళ్ళిపోతున్నాను” అని చెప్పారు. మెలకువ వచ్చేసింది. ఆయనెవరో నాకు తెలియలేదు. ‘ఒంగోలు’ అన్న ఊరి పేరు కూడా నేను వినలేదు. తరవాత ఆ స్వప్నం మర్చిపోయాను.

ఆ స్వప్నం వచ్చిన కొన్ని సంవత్సరాలకు మేము శిరిడి వెళ్లడం, అక్కడ బాబా అనుభవం ఇవ్వడం జరిగింది. బుక్ షాప్ లో నాకు ప్రవచనాలు గ్రంథం పైన వారి ఫోటో చూసినప్పటికీ, ఎక్కడో చూసినట్లు అనిపించింది కానీ పూర్తిగా గుర్తురాలేదు. US వచ్చాక వారి గ్రంథాలన్నీ చదువుతుంటే, క్రమేపీ అన్నీ గుర్తొచ్చాయి. నాకు వారెవరో తెలియకపోయినా నన్ను ఎప్పటినుంచో కనిపెట్టుకుని వున్నారన్నమాట! ఎంత కరుణ! మేము కొన్ని సంవత్సరాల క్రితం ఇండియా వచ్చినప్పుడు, ఒంగోలుకు వెళితే అక్కడ పూజ్యశ్రీ మాస్టరుగారికి పునుగులు నైవేద్యం పెట్టడం చూశాను. ఇదివరకెప్పుడో కలలో సమోసా నైవేద్యం పెట్టినది గుర్తుకొచ్చి వారికి ఏదైనా నైవేద్యంగా సమర్పించవచ్చని అర్థమైంది.

నాకు పూజ్యశ్రీ మాస్టరుగారి రచనలు చదువుతుంటే చాలా సందేహాలు

వచ్చేవి. అవన్నీ కూడా పూజ్యశ్రీ మాస్టరుగారినే అడుగుతూ వుండేదాన్ని. అప్పుడు ఒకసారి స్వప్నంలో పూజ్యశ్రీ మాస్టరుగారు, "గ్రీన్ రూమ్ లో కూర్చుని అనుష్ఠానం చెయ్యి!" అని చెప్పారు. నేను మా ఇంట్లో ఒక గదికి ఆకుపచ్చ రంగువేసి అందులో బాబా, పూజ్యశ్రీ మాస్టరుగారు, పూజ్యశ్రీ అమ్మగార్ల ఫోటోలు పెట్టుకున్నాను. అక్కడే కూర్చుని పూజ, పారాయణ, హారతులు.. అన్నీ చేసుకుంటాను. పూజ్యశ్రీ మాస్టరుగారు చెప్పినట్లు చేస్తూ, ఆలోచించుకుంటూ వుంటే చాలా విషయాలు అర్థమయ్యేవి. అలా చాలా విషయాలు స్వప్నం ద్వారా పూజ్యశ్రీ మాస్టరుగారు సూచిస్తూ వుండేవారు. తరవాత గురుపుత్రులు శ్రీ ద్వారకనాథ్ గారితో పరిచయం అయ్యాక సాయి మాస్టర్ ఫోరమ్స్ లోను, ఇండియా వచ్చినప్పుడు వారితో మాట్లాడుతూవుంటే ఆధ్యాత్మికతకు సంబంధించిన అనేక విషయాలలో స్పష్టత వచ్చింది.

మిలారేపా చరిత్రలో, "భూత భవిష్యత్ వర్తమానం అంతా ఒకటేనని గుర్తించి ఆ భావాన్ని నీకు సహజంగా అలవాటయ్యేటట్లు చూసుకో! ఇదే మీకు చివరిసారిగా ఇచ్చే ఉపదేశం. మీకు నేనిచ్చేది ఇదే నాయనా! ఇంతకంటే తెలుసుకోవలసిన అతీత సత్యం ఇంకొకటి లేదు. కాబట్టి దీనినే నీవు తెలుసుకో!" అని తన ఆఖరి సందేశాన్ని మిలారేపా తన శిష్యులకు ఇస్తారు. ఇది చదివాక, 'కాలంలో భూత, భవిష్యత్, వర్తమాన కాలాలు లేకుండా ఒక్కటిగా ఎలా వుంటుంది?' అనే సందేహం వుండేది.

ఒకరోజు రాత్రి ఒక స్వప్నం వచ్చింది. నేను, మావారు శిరిడీకి వెళ్ళాము. అది పాత కాలం నాటి శిరిడి. నేను ఇంట్లో రాత్రి పడుకున్నప్పుడు ఏ బట్టలు వేసుకున్నానో వాటితో వచ్చేశాను. మావారు మాత్రం చాలా శుభ్రంగా తయారై వచ్చారు. రోడ్డంతా మట్టి నేల. అలా నడుచుకుంటూ వెళుతున్నాము. ఒక చర్చి కనిపించింది, ఒక సరోవరం కనిపించింది, రెండు హంసలు వున్నాయి. అలా నడుస్తూ వుంటే శిరిడీ వచ్చింది. అక్కడ ఇళ్లన్నీ చాలా తమాషాగా వున్నాయి. ముందుభాగం అంతా కలిసి, వెనక పెరటి భాగమంతా కలిసి ఒకే వరుసలో వున్నాయి. నేను ఆ వెనుకవైపుకి వెళ్ళాను. అక్కడ ఒకావిడ బాబా ప్రసాదం కోసమని మినప్పప్పు రుబ్బుతున్నారు. నేను ఆ సేవ చేసుకోవచ్చా అనడిగాను, సరేనని ఆవిడలేచి వెళ్లిపోయారు. నేను రుబ్బుతూంటే దిగంబరంగా వున్న ఒక చిన్న అబ్బాయి వచ్చి, ఆ రుబ్బేది పెట్టమని అడిగాడు. నేను ఇంకా నైవేద్యం తయారుకాలేదని చెప్పాను. అయినా పెట్టమని అడిగాడు! సరేనని, కొంచెం ఆ అబ్బాయి చేతిలో వేశాను. ఆ బాబు దానిని నాకి, "సచ్చిదానందా!" అని పారిపోయాడు. నేను ఆశ్చర్యపోయి ఆ అబ్బాయిని పట్టుకుందామని పరిగెత్తాను. ఈలోపు మావారు ఒక ప్రత్యేకమైన కళ్లద్దాలు పెట్టుకుని వచ్చారు. దాంట్లో ఫోటో తీసే పరికరం కూడా వుంది. వెంటనే వారు ఆ పారిపోతున్న అబ్బాయిని ఫోటో తీశారు. మెలకువ వచ్చేసింది.

నాకర్థమైందేమిటంటే, పాత శిరిడీ భూతకాలానికి సంబంధించినది. నేను మా ఇంట్లో ఎలా వున్నానో అలా శిరిడీ రావడం వర్తమాన కాలం. మావారి కళ్ళద్దాలలో ఫోటో తీసే సౌకర్యం భవిష్యత్కాలము అని! ఒకేసారి గురుదేవులు నాకు మూడు కాలాలను అనుభవింపచేసినట్లు అనిపించింది.

పూజ్యశ్రీ మాస్టరుగారి బోధలకు, మార్గదర్శకత్వానికి అనేకానేక కృతజ్ఞతాపూర్వక నమస్సుమాంజలులు తెలియచేసుకుంటూ, ఇదేవిధంగా మాకు జీవితాంతం తోడుగా వుండాలని వారి పాదపద్మములకు ప్రణమిల్లుతూ ప్రార్థిస్తున్నాను.

జై సాయి మాస్టర్!

## ''బాబా నా పసుపు కుంకుమలు నిలిపారు''

26వ పేజీ తరువాయి

సరిపోయింది. ఈయనకు ఆరోగ్యం చేకూరేక "బాబా దయవలన మీరు బాగున్నారు. నాకు అలాటి కలవస్తే పాత అనుభవంతో భయపడ్డాను" అని చెప్పినాడు.

బాబాకు భక్తులయందు గల ప్రేమ, దయ అనుభవించినవారికే అర్థం అవుతుంది. సముద్రము లోతును, ఆకాశం ఎత్తును వర్ణించి చెప్పగలమా? అలాగే అనంతమైన బాబా పేమసాగరాన్ని మాటలలో చెప్పలేము. మావారికి ప్రాణదానంచేసి, నా పసుపుకుంకుమల్ని నిల్పి నా జీవితానికి వెలుగునిచ్చిన బాబాకు శతకోటి నమస్కృతులను అర్పిస్తూ మీ అందరితో నా ఆనందాన్ని పంచుకోవాలని యీ మా అనుభూతిని వ్రాసాను.

# పరమ పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ మాస్టరుగారిచే రచించబడిన అపూర్వ ఆధ్యాత్మిక వైజ్ఞానిక గ్రంథములు

**SRI GURUPADUKA PUBLICATIONS, C/o. SRI MANGA BHARADWAJA TRUST**
Regd. Office: Bhakta Nivas, 12-1-170/46P, Hanuman Nagar, Jaipuri Colony, Nagole,Hyderabad - 500068, Phone: +91 7416041550
Branch Office : Kondalah Bunk Street, Kothapeta, Ongole, Prakasam Dist. Andhra Pradesh. Phone: 8597233271
*Send DD in favour of 'Sri Manga Bharadwaja Trust (Publications)' Payable at Hyderabad or Ongole*

### శ్రీ గురుని పై విరచితమైన గ్రంథములు

| | |
|---|---|
| శ్రీ గురు చరిత్ర – శ్రీ సాయి లీలామృతము (బౌండ్) | ₹499.00 |
| శ్రీ గురు చరిత్ర | ₹199.00 |
| శ్రీ సంహితాయన గురు ద్విసాహస్రి | ₹149.00 |
| శ్రీ దత్తావతార మహాత్మ్యము | ₹75.00 |

### శ్రీ శిరిడీ సాయిబాబాపై విరచితమైన గ్రంథములు

| | |
|---|---|
| శ్రీ సాయి లీలామృతము | ₹199.00 |
| శ్రీ సాయి సన్నిధి | ₹199.00 |
| శ్రీ సాయినాథ ప్రబోధామృతము. | ₹119.00 |
| శ్రీ సాయినాథ పూజ | ₹49.00 |
| శిరిడీ హారతులు | ₹15.00 |
| శిరిడీ క్షేత్ర సందర్శనము | ₹49.00 |
| శ్రీ సాయినాథ స్తవన మంజరి | ₹10.00 |
| సాయిని పూజించడం ఎందుకు? | ₹10.00 |
| సత్సంగము – భజన | ₹10.00 |
| సాయి సూక్తి – ఆచార్యవాణి | ₹20.00 |
| శ్రీ సాయి నిత్య సత్య వ్రతము<br>(రచన : పూజ్య గురుపత్ని శ్రీ అలివేలు మంగమ్మ) | ₹20.00 |

### ఇతర మహాత్ముల గ్రంథములు

| | |
|---|---|
| శ్రీ స్వామి సమర్థ | ₹75.00 |
| శ్రీ తాజుద్దీన్ బాబా | ₹75.00 |
| అవధూత శ్రీ వెంకయ్య స్వామి | ₹99.00 |
| అవధూత శ్రీ చీరాల స్వామి | ₹75.00 |
| శ్రీ పాకలపాటి గురువుగారు | ₹75.00 |
| శ్రీ ఆనందమయి అమ్మ | ₹75.00 |
| టిబెట్ యోగి మిలారేపా చరిత్ర | ₹99.00 |
| శ్రీ గురు సిద్ధారూఢ స్వామి<br>(రచన : శ్రీమతి శారదా వివేక్) | ₹99.00 |
| అవధూత శ్రీ చివటం అమ్మ<br>(రచన : శ్రీమతి శారదా వివేక్) | ₹99.00 |

### అన్వేషణాత్మకమైన వైజ్ఞానిక గ్రంథములు

| | |
|---|---|
| ఏది నిజం? | ₹49.00 |
| మతం ఎందుకు? | ₹49.00 |
| విజ్ఞాన వీచికలు | ₹99.00 |
| పరిప్రశ్న | ₹119.00 |

### ధ్యాన సంబంధమైన గ్రంథములు

| | |
|---|---|
| ధ్యానయోగ సర్వస్వము | ₹99.00 |
| బుద్ధ ధ్యాన హృదయము | ₹49.00 |

### ఆధ్యాత్మికత – తత్వచింతనా పూర్వక గ్రంథములు

| | |
|---|---|
| శ్రీ సాయి మాస్టర్ ప్రవచనములు | ₹199.00 |
| ఆధ్యాత్మిక జాగృతి<br>(రచన : పూజ్య గురుపత్ని శ్రీ అలివేలు మంగమ్మ) | ₹199.00 |

### ఇతర గ్రంథములు

| | |
|---|---|
| పురుషసూక్త రహస్యము | ₹49.00 |
| మనము – మన సంస్కృతి | ₹75.00 |

### పూజ్య భరద్వాజ గురుదేవులపై విరచితమైన గ్రంథములు

| | |
|---|---|
| మహాత్ముల ముద్దుబిడ్డడు<br>(రచన : శ్రీ సి.థామస్ రెడ్డి) | ₹149.00 |
| భగవాన్ శ్రీ భరద్వాజ<br>(రచన : శ్రీమతి శ్రీదేవి) | ₹299.00 |
| మహా పురుషుడు<br>(రచన : పూజ్య గురుపత్ని శ్రీ అలివేలు మంగమ్మ) | ₹60.00 |
| శ్రీ సాయి మాస్టర్ స్మృతులు –1<br>(సంకలన కర్త : లక్ష్మీ నరసమ్మ) | ₹199.00 |
| శ్రీ సాయి మాస్టర్ స్మృతులు –2<br>(సంకలన కర్త : లక్ష్మీ నరసమ్మ) | ₹199.00 |
| ఆచార్య అమృత లేఖావళి<br>(సంకలనం : శ్రీ సి.థామస్ రెడ్డి) | ₹199.00 |
| మరో నంద దీపం | ₹120.00 |
| మాస్టారు అమృత వాక్కులు<br>(రచన : శ్రీ సి.థామస్ రెడ్డి) | ₹99.00 |

### బాలల కొరకు విరచితమైన గ్రంథములు


| | |
|---|---|
| బాలల సాయి లీలామృతము<br>(రచన : శ్రీమతి అడిదం వేదవతి) | ₹49.00 |
| బాలల సాయిసన్నిధి<br>(రచన : శ్రీమతి అడిదం వేదవతి) | ₹75.00 |
| బాలల శ్రీ గురు చరిత్ర<br>(రచన : శ్రీమతి అడిదం వేదవతి) | ₹75.00 |

### BOOKS IN ENGLISH

| | |
|---|---|
| Sai Baba The Master | ₹249.00 |
| Shri Guru Charitra | ₹149.00 |
| Supreme Master | ₹149.00 |
| Tajuddin Baba | ₹149.00 |
| Sai Baba and His Teachings | ₹149.00 |
| Children's Sai Baba The Master<br>*(Author: Smt. Adidam Vedavati)* | ₹80.00 |

### BOOKS IN OTHER LANGUAGES

| | |
|---|---|
| Sadguru Sri Sai Baba (Hindi) | ₹249.00 |
| Sri Guru Charitra (Hindi) | ₹249.00 |
| Sri Sai Leelamruthamu (Kannada) | ₹249.00 |
| Sri Sainatha Prabodhamruthamu (Kannada) | ₹149.00 |
| Sri Guru Charitra (Kannada) | ₹199.00 |
| Sri Sai Sannidhi (Kannada) | ₹249.00 |
| Tibet Yogi Milarepa Charitra (Kannada) | ₹119.00 |
| Sri Swami Samartha (Kannada) | ₹119.00 |
| Sri Sai Leelamruthamu (Tamil) | ₹249.00 |
| Sri Guru Charitra (Tamil) | ₹299.00 |
| Sri Shirdi Sai Aartulu (Tamil) | ₹29.00 |
| Sri Sainatha Stavana Manjari (Tamil) | ₹20.00 |
| Sri Sai Leelamruthamu (Malyalam) | ₹299.00 |
| Sri Guru Charitra (Malyalam) | ₹299.00 |
| Sri Guru Charitra (Odiya) | ₹299.00 |
| Sri Sai Sannidhi (Odiya) | ₹249.00 |


భగవాన్ శ్రీ భరద్వాజ
శ్రీమతి శ్రీదేవి


ఆధ్యాత్మిక జాగృతి
(మాతృదేవి పూజ్యశ్రీ అలివేలుమంగమ్మ రచించిన వ్యాసముల సంపుటి)

**Date of Publication: 21st of each month. Permitted to post: 23rd, 24th, 25th and 26th of each month.**
**Edited, Printed and Published by Dr. R.S. Sasidhar, Ph.D. trustee of Sri Manga Bharadwaja Trust,**
**Ongole - 523002. Postal Registration Number : Prakasam/16/2024-2026, Regd.No. 37926/83.**



శ్రీ శిరిడీ సాయినాథుడు మహాసమాధి చెందిన పుణ్యతిథి (12-10-24), శ్రీ భరద్వాజ గురుదేవుల జన్మదినోత్సవము (30-10-24), గురుపత్ని శ్రీ అలివేలు మంగమ్మ తల్లి జన్మదినోత్సవము (1-10-24) ల సందర్భంగా సాయిబాబా పత్రిక పాఠకులందరికీ ఆ సద్గురు మూర్తుల ఆశీస్సులు లభించాలని ప్రార్థన!!

భక్తులందరూ పుణ్యప్రదమైన ఈ అక్టోబరు నెలను సద్గ్రంథ పారాయణ, సేవ, చింతన, పూజనాది కార్యక్రమాలతో సద్వినియోగపరచుకొనగలరు.



IF UNDELIVERED, PLEASE RETURN TO: SRI MANGA BHARADWAJA TRUST, KONDAIAH BUNK STREET, KOTHAPETA, ONGOLE, PRAKASAM DT., A.P. - 523002.